ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ENTERED

Entered

అక్టోబర్ 17, 2010

ఎస్.ఆర్.శంకరన్ పై
కె.ఆర్.వేణుగోపాల్

ప్రశంసలు ! ప్రశ్నలు!!

హ్యాపీబర్త్‌డే

(2010 అక్టోబర్ 17 నుంచి 2010 అక్టోబర్ 23 వరకు)

విజయశ్రీ
అక్టోబర్19
సరోజ-యాదయ్య
తాటిపల్లి-మెదక్

రామ్ ప్రనన్
అక్టోబర్17
మంగ-శ్రీశైలం
కోనాపూర్-మహబూబ్‌నగర్

వల్లభ్ ఆశ్రిత్
అక్టోబర్21
మాధవి- ప్రసాద్
బెంగుళూరు

జి.వి.తేజ సుమని
అక్టోబర్20
కవిత-నారాయణ
నరసరావుపేట

జి.సాయివర్ష
అక్టోబర్19
కల్పన-సురేష్
ఖమ్మం

ఎస్.ఫయాజ్
అక్టోబర్17
మహబూబా-మహబూబ్‌బాషా
బెల్లంమంది-కడప

ఎ.వెంకట సాయిశరత్
అక్టోబర్17
శివరాణి-గురుప్రసాద్
కంకిపాడు

కె.జువేరియా అంజుమ్
అక్టోబర్20
బీబి ఆయేషా-అతావుల్లా
పెనుకొండ-అనంతపురం

కె.అనిల్ కుమార్
అక్టోబర్20
రాణెమ్మ-రాజయ్య
తాటిపల్లి-మెదక్

సిహెచ్.హైందవి
అక్టోబర్
అనిత-సీతారామిరెడ్డి
తాడేపల్లిగూడెం- ప.గో

జి.యోగాంజలి
అక్టోబర్
మాధవి-లీలావరప్రసాద్
టెక్కలి-శ్రీకాకుళం

పి.తులసి
అక్టోబర్
మంజుల-అంజయ్య
ధర్మన్నగూడెం-రంగారెడ్డి

ENTERED

మనలో మాట

దసరా వేషాలు

దసరా పండగంటే సరదాలు, సంబరాలు.

ఆటలు, పాటలు, నాటకాలు, జానపదాలు, వేషాలూ, విల్లంబులూ, మామూళ్లూ...!

ఒకటా రెండా.. ఎన్ని ప్రత్యేకతలో!!

దసరా వస్తుందంటేనే పిల్లల్లో ఆనందం. పాఠశాలలకు పదేసి రోజులు సెలవులిస్తుంటే సంతోషమే కదా మరి. కాకపోతే పెద్దలకే కూసింత తలనొప్పి. ఈ పిడుగుల కోతి వేషాలను ఇన్నిరోజులు ఎలా భరించాల్రా బాబూ! అంటూ ఒకటే దిగులు.

ఒట్టి పిల్లవేషాలేనా. పెద్దల వేషాలూ తక్కువేంకాదు. దసరా మామూళ్లకోసం కరెంటు, టెలిఫోన్, గ్యాస్, మున్సిపాలిటీ, తపాలావారు తలుపు తడుతుంటారు. డబ్బులివ్వలేక చెప్పలేక వాకిట్లోనే పిల్లలను కూర్చుండబెడుతుంటారు. ఇక చిన్నారులు వారికి చెప్పే సమాధానాలు చూడాలి. కడుపుబ్బ నవ్విస్తుంటాయి.

ఇంటిల్లపాదికీ కొత్త బట్టలు కుట్టించాలనీ, పిండివంటలు చేసుకోవాలనీ ఎవరికుండదు! చేతిలో పైసలే కరవు. ధరలా అందవు. దాంతో ఇంటాయన గర్జనలు....గాండ్రింపులు. ఈయనగారి ముందు వీధిలో తిరిగే పులివేషగాడే నయమనిపిస్తుంది.

దసరా వేషాల్లో పులివేషం ప్రత్యేకమైనది. పులివేషగాడు ఈ పదిరోజులూ నిజంగా పులే! వేషం కట్టుకొని వీధిలోకొస్తే పిల్లలే కాదు పెద్దలూ భయపడతారు. దసరా పర్వం ముగిశాక పులివేషగాడిని ఎవ్వరూ పట్టించుకోరు. అసలు లెక్కేచేయరు.

అనుకుంటాంగానీ...మన రాజకీయ నాయకులు వేసే వేషాల ముందు పులివేషగాళ్లెంత?! ఎన్నికలొచ్చినప్పుడు, అవసరమైనప్పుడు రకరకాల వేషాల్లో వస్తారు. తేపకో రంగు కండువా కప్పకుంటారు. టోపీ పెట్టుకొంటారు. ఎప్పుడు ఏ వేషం వేస్తారో వారికే ఎరుక. వీరి వేషాల ముందు దసరా వేషాలు వెలవెలపోతాయి. అవసరానికి హఠాత్తుగా వరాలు కురిపించేస్తారు. బీదబిక్కి పిల్లలనెత్తుకొని నవ్విస్తారు. ఫొటోలకు ఫోజులిస్తారు. ఆ వేషం ముగిశాక ఆ బీదలు గుర్తేరారు. పగటివేషగాళ్లన్నా ఏడాదికోసారి వాకిట్లోకొస్తారు. రాజకీయ వేషగాళ్లు మాత్రం మళ్లీ కనిపించేది మరో ఐదేళ్లకే. అందాకా ఎవరి వేషాలు వారే వేసుకోవాలి. మరి బతకాలికదా!

ఎవరు ఏ వేషమేసినా ఎవరి పబ్బం వారిది. ఎవరి అవసరం వారిది. అర్థంచేసుకోకుంటే అంతేసంగతులు! చిత్తగించవలెను!!

★

ఈ సంచికలో....

టపా	...	2
ఇంటర్వ్యూ	...	4
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
ఈ పేజ్	...	9
సీరియల్	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కొత్త పుస్తకాలు	...	20
వికాసం	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

తెల్సా ... 8

ఆడపిల్ల పుడితే చాలు! మామిడి మొక్కలు నాటేస్తారు!!

కథ ... 18

ఋణం



సుశీల కథ బావుంది

ఆదివారం ప్రజాశక్తి స్నేహలో ప్రచురించిన అట్టమీద వ్యాసం బాగుంది. ట్రాఫిక్ టెర్రర్ గురించి వివరంగా తెలుసుకొన్నాం. ఈ రోజు నగరాలల్లో ట్రాఫిక్ సమస్య అంతులేనిది. గంటలకొద్ది ట్రాఫిక్ జామ్. అస్తవ్యస్థమైన వ్యవస్థ వెరసి తీవ్ర గందరగోళం. కంప్యూటర్ సిగ్నల్ వ్యవస్థను నెలకొల్పి ట్రాఫిక్ పెనుభూతం నుండి వాహనదారులను రక్షించాలి. అప్పుడే కాలుష్య రహిత వాతావరణాన్ని ప్రజలకు కల్పించవచ్చు. అభ్యుదయ దర్శకుడు తిలక్ గురించి అనేక విషయం తెలుసుకొన్నాం. సినిమా రంగంలో ప్రత్యేక స్థానం కల్గి అభ్యుదయ భావాలతో ప్రజలలో చైతన్యవంతులుగా మార్చగలిగిన మంచి చిత్రాలకు దర్శకత్వం వహించి వారి మనస్సులలో చిరస్థాయిగా నిలిచాడు. అందుకే బిదాయ్ తిలక్. చైనాలో చూడవలసిన ప్రదేశాలు అనేకం. అక్కడి దేవాలయలు, పార్కులు, గుహలు, శిల్పలు అత్యంత రమ్యంగా ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన చైనా పర్యాటక రంగంలో ముందంజలో ఉంది. సుశీల కథ బాగుంది. "పాపం లేడి పిల్ల" బాలల కథ బావుంది. పిల్లలకు వినోదంలోబాటు నీతిని కూడా పంచింది. అందుకే ఈ వారం స్నేహ బాగుంది.

డి.వై.రాజు, గణపవరం, గుంటూరు.

మెరిపించి మురిపించింది

ఈ వారం అనుబంధం సాహిత్యపరంగా అక్షరాక్షరం మెరిపించి మురిపించింది. ఈ వారం 'స్ఫూర్తి' శీర్షికలో పెన్నా అనంతరామశర్మ గారు రచించిన 'మార్గం చూపిన మావో సూక్తులు' ఎంతో ధీటైన విశేషాలను అందించింది. కవిత్వమ్‌లో 'నేను నేనుగా, స్వేచ్ఛ- మనుగడ'లో అక్షరాక్షరం సాహిత్య సాన్నిహిత్యంలో ముందుకు సాగి కవితాత్మకతను వెలిబుచ్చాయి. ధన్యవాదాలు. ఈ వారం 'రుచి'లో చనా మసాలాదోసె, పనీర్ మసాలా దోసె కొత్త రుచులు అందించాయి. అట్టమీదకథ "ట్రాఫిక్ టెర్రర్" నేటి ట్రాఫిక్ సమస్యతోపాటు కాలుష్య కాసారాలుగ నిలిచిన నగరాలు, పట్టణాలు ఎంతటి ఆందోళన కలిగిస్తున్నాయనే విషయాన్ని వివరణాత్మకంగా చెప్పింది. ఈ వారం 'కథ' సుశీల గృహిణిపాత్రను చక్కగా విశ్లేషించింది. ఈ వారం మనలో మాట 'కామన్ గేమ్స్' ఆరంభ సంరంభం ఎంతో విశ్లేషాత్మకంగా వుంది.

టి.వి.డి.ఎం. సీతారామారావు, విజయవాడ.

నిజంగానే మార్గదర్శకాలు

సమకాలీన వామపక్ష విప్లవ ఉద్యమాలలో ఉద్యమకారులకు మావో సూక్తులు ఆచరణాత్మక మార్గదర్శకాలు. "నూరు పూలు వికసించనీయండి. నూరు స్వేచ్ఛాభావాలు అభ్యుదయానికి దోహదపడతాయి. అలాగే ఈ ప్రపంచం మీది. మాది కూడా. చివరికి మీది. మీరు ఉదయించి పైకొస్తున్న సూర్యులు. పట్టపగటి ప్రభావం మీది. మాది అస్తమించే దశ". ఈ రెండు సూక్తులు చాలా మంది ఉద్యమకారులను ప్రభావితం చేసాయి. ఈ సూక్తుల గురించి స్ఫూర్తి ద్వారా తెలియజేసినందుకు అనంతరామశర్మగార్కి అభినందనలు. కవర్ స్టోరీ 'ట్రాఫిక్ టెర్రర్' వాస్తవానికి అద్దం పట్టింది. వాహనాలు పెరగడంతో విపరీతమైన ట్రాఫిక్ జాములు. నిబంధనల ఉల్లంఘనలు. కాలుష్య ప్రభావం తీవ్రమైంది. నివారణ చర్యలు గైకొనాలి.

జె. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

అలరించిన చైనా అందాలు

చైనాలో చూడాల్సినవెన్నో... అన్న వ్యాసం అలరించింది. ప్రపంచదేశాలలో జనాభాకు ప్రథమస్థానం పొందిన చైనా స్థితిగతులను బాగా తెలిపారు. తెలీని అనేక విషయాలను చెప్పారు. చైనా వారు కష్టజీవులని ఎక్కువ మంది భారత్‌లోవలె గ్రాములలో నివసిస్తారని, పెద్దల ఎడ గౌరవభావంతో వుంటారని, చైనాగోడ నేటికీ గ్రేట్‌వాల్ గానే వుందని వ్యవసాయం ప్రధానం వృత్తి వరి పంటకు అగ్రస్థానం వహించిందని, జీవనదులతో విరాజిల్లుతోందని, 40 వేల బౌద్ధాలయాలు- ఆరామాలు వున్నాయని చక్కగా తెలిపారు.



ధన్యవాదాలు.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డి అన్నారం, హైదరాబాద్.

చెప్పుల మార్పు సంతోషం

కామన్ (వెల్త్) గేమ్స్, కామన్ గేమ్స్ కాకుండా ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, దేశ ప్రతిష్టను నిలపాలి. మసాలా మనసును, పొట్టను దోస్తుంది. వామపక్ష భావాల తిలకుడు, కానని లోకాలకు పోవడం విచారకరం. చైనా దర్శనకు పోవాలంటే పెట్టి పుట్టాలి. రవాణా వ్యవస్థను రూపుదిద్దాలంటే వేరే భాగ్యనగరం నిర్మించాలి. ఒక కార్టూన్ వేసినా బావుంది. చెప్పుల మార్పు సంతోషం. బావుంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు. ★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:

కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

SPEAK ENGLISH FLUENTLY
6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-9789099589
హలో: 044-42121947

లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని SMS చేయండి

చెన్నై ఫోన్ నెంబరుకు చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లను తెలియజేసి రూ.1000/-లకు వి.పి.పి. ద్వారా పంపమని ఫోన్ ద్వారా తెలపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ పేకెట్ పొందగలరు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE™
AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 600 017.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ మరియు ఫ్రీ మెమరీ కోర్స్ ఇవన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **KARIMNAGAR:** D.No.2-6-286, C.V.R.N Road, Near:Inspection Bunglow. **Cell:**9392417745, 9030455603. ● **SURYAPET:**Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**9392417745, 90304 55603. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478.● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex , **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502.**Cell:**98852 81530, 9052180134. ● **NANDIKOTKUR:** D.NO.16-59B,College Road,**Cell:**93904 44252,98494 92298. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384.● **KURNOOL: Shop** No.C-45, RMK Plaza,OPP: Kalukura Hotel. **Cell:**99855 01587. ● **DHONE:**Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

కె.వి.ఆర్ ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు **93466 54210** నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

జనం గుండెల్లో నిలిచిన శంకరన్

దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి భూమి కీలకమని గుర్తించి అందుకోసం తనకున్న అవకాశాన్ని వినియోగించిన బడుగుజనుల పక్షపాతి ఎస్. ఆర్. శంకరన్. నూటికి నూరుపాళ్లూ నిఖార్సైన ప్రభుత్వాధికారి. అత్యున్నత స్థాయి అధికారి అయినా అత్యంత సాధారణ జీవితం గడిపిన ఆదర్శమూర్తి. అలాంటి మహోన్నత వ్యక్తి జీవితం గురించి, ఆయన ప్రజలకు చేసిన సేవల గురించి విశ్రాంత ఐఎఎస్ అధికారి కె. ఆర్. వేణుగోపాల్ 'ప్రజాశక్తి'కి వివరించారు. ఒక ఐఎఎస్ అధికారిగా అణగారిన వర్గాల ప్రజలకు సేవ చేసేందుకు శంకరన్ పడ్డ తపన, ఈ నేపథ్యంలో వివిధ వర్గాల నుండి ఎదుర్కొన్న సవాళ్లు, ఆటుపోట్లు, ఆయన సాధించిన విజయాలను వివరిస్తూ కె.ఆర్. వేణుగోపాల్ 'ప్రజాశక్తి' ప్రత్యేక ప్రతినిధి బి. వి. ఎన్. పద్మరాజుకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

శంకరన్‌ను చాలామంది దళితునిగా భావించారు ఎందుకని?

ఒక ఐఎఎస్ అధికారిగా నేను కూడా ఈ విషయాన్ని గమనించాను. ఎవరైనా ఒక ప్రభుత్వాధికారి ఒక సామాజికవర్గ శ్రేయస్సు కోసం పనిచేస్తే అతడు తమ కులానికి చెందిన వ్యక్తేనని ప్రజలు భావిస్తుంటారు. ఈ భావన మన దేశంలో బాగా వేళ్లూనుకుంది. శంకరన్ దళితుల సంక్షేమం కోసం విశేష కృషి చేశారు కాబట్టి ఆయన్ను దళితుడుగా భావించారు. వాస్తవానికి ఆయన బ్రాహ్మణుడు. ఎవరూ కులాన్ని ఎంపిక చేసుకొని పుట్టరుగా. ఒక కలెక్టరుగా నేను గిరిజన ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇతర పర్యటనల్లో వెళ్లినప్పుడు హాజరైన జనాన్ని చూసి 'మన వాళ్లందరూ వచ్చారుగా' అనేవాణ్ని. అక్కడి జనం మాత్రం నన్ను తమ కులానికి చెందిన వాడిగా భావించేవారు. శంకరన్‌కు కూడా దళితులు ఇదే విధంగా భావించారు. 'మనం' అనే పదంలో చాలా శక్తి వుంది. మనవాళ్లు అన్న ఒక్క మాటతో మనసుకు చాలా నమ్మకం ఏర్పడుతుంది. ఇది నా అనుభం. తమకు అన్ని విధాలా అండదండలనిచ్చి, జీవితాల్లో వెలుగులు నింపినందుకు గాను మరే ఇతర ఐఎఎస్ అధికారికి ఇవ్వనంత గుర్తింపు, గౌరవాన్ని ఆయనకు దళితులు, గిరిజనులు ఇచ్చారు.

శంకరన్ ప్రత్యేకత ఏమిటి?

శంకరన్ గురించి తెలుసుకోవాలంటే ముందుగా పిఎస్ కృష్ణన్ గురించి తెలుసుకోవాలి. ఈయన 1956 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. శంకరన్‌గారి కంటే సీనియర్. ఓట్లు, కుల రాజకీయాల వల్ల ఈ దేశంలో అణగారిన వర్గాల వారి అభ్యున్నతి సాధ్యం కాదని గమనించిన వ్యక్తి పిఎస్ కృష్ణన్. దేశంలో దళితులు, గిరిజనులు, అణగారినవర్గాల వారి అభ్యున్నతి కోసం అధికారులే చొరవ తీసుకోవాలని కృష్ణన్ మార్గనిర్దేశనం చేశారు. ఆయన మలయాళీ బ్రాహ్మణుడు. చదువుకొనే దశలో కమ్యూనిస్టు సభ్యుడు కావచ్చు. పి.ఎస్.కృష్ణన్ అడుగుజాడల్లో నడిచిన శంకరన్ నెల్లూరు జిల్లాలో భూ పంపిణీకి కార్యాచరణ తయారుచేశారు. ఆ జిల్లాలో 2 ఏళ్లపాటు జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన శంకరన్ 'ల్యాండ్ ఎసైన్‌మెంట్ పాలసీ'ని సమర్ధవంతంగా ఉపయోగించారు. తద్వారా జనం గుండెల్లో నిలిచిపోయారు. భూమి లేని పేదలు తమకు భూమి కేటాయించాలంటూ దరఖాస్తు చేసుకొంటే ప్రభుత్వభూమిని పేదలు సాగు చేసుకోవడానికి ఇచ్చే అవకాశం ఆ పాలసీలో వుంది. ఇది బ్రిటిష్ కాలం నుంచి వున్న పాలసీయే. అంతకు ముందెవరూ దాన్ని సీరియస్‌గా పట్టించుకోలేదు. జాయింట్ కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములున్నాయో లెక్కలు తీయమని కింది అధికారులను ఆదేశించారు. ఆ వివరాలన్నీ అందాక భూమిలేని పేదల నుంచి దరఖాస్తులు తెప్పించుకొని ఆ భూములను వారికి అసైన్ చేశారు. ఈ చర్యవల్ల దళితులు, వారిలాగే అతి హీనమైన స్థితిలో జీవిస్తున్న యానాదులకు ఎక్కువ ప్రయోజనం కలిగింది. ఇతర కులాలలోని పేదలు కూడా కొందరు లాభపడి వుంటారు. అయితే ఆ ప్రభుత్వ భూములన్నీ అలా పోరంబోకులుగా పడివున్నవి కావు. అందులో భూస్వాముల భూములూ వున్నాయి. కాని శంకరన్ లెక్క చేయలేదు. అలాంటి భూములను కూడా అసైన్ చేశారు. అవి అసైన్‌దారుల సాగులోకి వచ్చేట్లు చూశారు. కొన్ని భూములు అప్పటికే భూస్వాములు కబ్జా భూముల్లో వేసుకొన్న పంటతో సహా భూమిని పేదలకు దక్కేట్లు చూశారు. ఇది చిన్న విషయం కాదు. భూపంపిణీ చేసి వారి ఆర్థిక స్వావలంభనకు బాటలు వేశారు. ఈ చర్యల ద్వారా శంకరన్ అనంతమైన కీర్తిని సంపాదించారు. శంకరన్ నెల్లూరు జిల్లా నుండి బదిలీ అయిన కొద్ది కాలానికి నేను ఆ జిల్లాకు అసిస్టెంట్ కలెక్టరుగా శిక్షణ నిమిత్తం వెళ్లాను. ఆ సందర్భంలో ఆ జిల్లాలో ఎక్కడ విన్నా శంకరన్ పేరే వినబడేది.

భూముల విషయంలో శంకరన్ సమస్యలు ఏవైనా ఎదుర్కొన్నారా?

చాలా సమస్యలు, ఆటుపోట్లను ఆయన ఎదుర్కొన్నారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో బలమైన శక్తి కలిగిన రెడ్డి సామాజికవర్గం నుండి అడుగడుగునా బెదిరింపులు ఎదుర్కొన్నారు. అక్కడి రెడ్లు ఎవ్వరి మాటా వినేవారు కాదు. ఐఎఎస్ అధికారులను కూడా లెక్కచేసేవారు కాదు. భూ పంపిణీ సమయంలో శంకరన్‌ను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఐఎఎస్ కేడర్ కానప్పటికీ అప్పటి నెల్లూరు కలెక్టర్ ఎం. వి. రాజగోపాల్ అండగా నిలబడ్డారు. ఆయన కేంబ్రిడ్జి విద్యార్థి. సంస్కరణవాది. ఆధునిక ఆలోచనలు కలవాడు. నేను ఒక సందర్భంలో శంకరన్‌కు ఇంత గొప్ప పేరెలా వచ్చింది అని జిల్లా కలెక్టరును అడిగాను. అప్పుడు ఆయన 'మనమంతా సంస్కరణలవాదులం. కానీ శంకరన్ విప్లవవాది. ఆయన వర్ల్డ్ క్లాస్ ఆఫీసర్ అని అభివర్ణించారు. ఆ పదబంధం నేను మొదటిసారి విన్నాను. తన కింద పనిచేసిన ఒక జాయింట్ కలెక్టర్ గురించి జిల్లా కలెక్టర్ ఒక అసిస్టెంట్ కలెక్టర్‌కు ఈ విధంగా చెప్పారంటే శంకరన్ గొప్పతనానికి ఇంతకన్నా తార్కాణం ఏముంటుంది.

రెవెన్యూ, పోలీసు శాఖలో సాధారణంగా అధికారులు భూస్వామ్య కుటుంబాల నుంచి వస్తారుకదా? అయినా భూమి కేటాయింపులను ఎలా అమలు చేయించగలిగారు?

ఒక జిల్లా మేజిస్ట్రేట్‌గా కలెక్టర్ తాను ప్రజలకేదైనా చెయ్యాలనుకుంటే కచ్చితంగా చెయ్యగలడు. ఆయనకు అలాంటి అధికారాల్ని ప్రభుత్వం, రాజ్యాంగం కల్పించాయి. కలెక్టరు, జాయింట్ కలెక్టరు, అసిస్టెంట్ కలెక్టర్లకు వారి వారి స్థాయిల్నిబట్టి అధికారాలుంటాయి. వాటిని వినియోగించుకుని సాధ్యమైనంతగా ప్రజలకు సేవ చేయొచ్చు.అయితే సాధారణ ప్రజలకోసం నిలబడాలనుకొనే అధికారులు నిజాయితీపరులై ఎలాంటి వ్యసనాలు లేనివారై వుండాలి. ఒక ఐఎఎస్ అధికారి నిక్కచ్చిగా పనిచేయాలనుకుంటే అతడు మూడు(అవినీతి, తాగుడు, వివాహేతర సంబంధాలు) బలహీనతల్ని అధిగమించాలి. ఈ బలహీనతల్లో ఏ ఒక్కటి ఉన్నా సదరు ఐఎఎస్ అధికారికి సమాజంలో గౌరవం ఉండదు. కిందిస్థాయి అధికారులు అతని ఆదేశాల్ని లెక్కచేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అధికారి ప్రజలకు సేవ చేయలేడు. ఈ బలహీనతలన్నింటినీ అధిగమించిన శంకరన్ తన అత్యున్నతమైన ప్రవర్తనతో చట్టాల్లో వున్న అవకాశాలను ఉపయోగించుకొని తాను అనుకొన్నది అమలుచేయగలిగారు. భూసంస్కరణల చట్టం అమల్లోకి రాకముందే ఆయన బ్రిటిష్ కాలంనాటి నిబంధనలను ఉపయోగించి పేదలకు భూములు లభించేట్లు చూశారన్నది మనం గమనంలో వుంచుకోవాలి.

వ్యక్తిగతం...

పూర్తి పేరు : ఎస్.ఆర్. శంకరన్

పుట్టిన సంవత్సరం : 1934

స్వస్థలం : తమిళనాడులోని తంజావూరు జిల్లా సిరిగలత్తూరు గ్రామం

ఐఎఎస్ బ్యాచ్ : 1957 బ్యాచ్‌కు చెందిన వారు

నిర్వహించిన పదవులు : నెల్లూరు జిల్లా కలెక్టరు, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో పనిచేశారు

పదవీ విరమణ : 1992లో

వ్యక్తిత్వం : నిరాడంబరత, అభిప్రాయాలను వ్యక్తం చేయటంలో నిక్కచ్చిగా వ్యవహరించడం.

అధికారాన్ని ఎలా ఉపయోగించారంటే : ఉన్నతస్థాయి సమావేశాల్లోనూ పేదలు, దళితుల తరపున గట్టిగా వాదనను వినిపించేవారు.

కీలకపాత్ర : బొగ్గు గనుల్ని జాతీయం చేయటంలో, వెట్టిచాకిరీని నిర్మూలించటంలో కీలకపాత్ర పోషించారు.

లక్ష్యం : బలహీనవర్గాలు ప్రత్యేకించి దళితులు, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు. రాజ్యాంగం ప్రకారం ఆకలిని నిర్మూలించటం ప్రభుత్వ బాధ్యతని గట్టిగా విశ్వసించారు. అందుకోసం తీవ్రంగా కృషి చేశారు.

ప్రధాన భూమిక : రాష్ట్రంలో పోలీసు ఎన్‌కౌంటర్లు, నక్సల్స్ ప్రతిహింసల కారణంగా నెలకొన్న పరిస్థితుల్లో ఆయన కలత చెందారు. శాంతియుత వాతావరణం ఏర్పడేందుకు కృషి చేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన శాంతిచర్చల్లో ప్రధాన భూమిక పోషించారు.

వివిధ కమిటీల్లో సభ్యునిగా : 2006లో అటవీ హక్కుల చట్టం వచ్చిన తర్వాత దాని అమలుకోసం 19 మంది సభ్యులతో ఏర్పాటైన కమిటీకి శంకరన్ నాయకత్వం వహించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టటానికి ఎదురయ్యే సవాళ్లపై అధ్యయనం చేయటానికి ప్రణాళికాసంఘం నియమించిన కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా దేశవ్యాప్తంగా ఐటిడిఎల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన కాలంలోనే శంకరన్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మార్గదర్శకాలు, నిబంధనలు రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను బలోపేతం చేశారు. జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ఎస్సీ ఉప ప్రణాళిక (ఎస్సీఎస్‌పి), గిరిజన ఉప ప్రణాళిక (టిఎస్‌పి)లకు శంకరన్ రూపకల్పన చేశారు.

ఐఎఎస్‌లకు ఇచ్చే శిక్షణలో పేదల ఉద్ధరణ అనేది లక్ష్యంగా వుంటుందా?

ఉండనే ఉండదు. ఇప్పుడేమైనా మారిందేమోగాని మేము శిక్షణ పొందిన సమయంలో అలాంటిది అస్సలు లేదు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవడం, శాంతిభద్రతలను చూసుకోవడం ఈ రెండే ప్రధాన అంశాలు. ఈ ధోరణిలో పెద్దగా మార్పు వచ్చిందని చెప్పుకోలేం. నేనూ కాకి మాధవరావు లాంటి అధికారులం శంకరన్ స్ఫూర్తితో కొన్ని చర్యలు చేపట్టాం. శంకరన్ నెల్లూరు నుంచి బదిలీ అయ్యాక కూడా ఆయన చేపట్టిన పని కొనసాగింది. నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా వున్నప్పుడూ నేను శంకరన్‌ను ఎప్పుడూ చూడలేదు. ఆయన గురించి పేదలు గొప్పగా చెప్పుకొంటుంటే విన్నాను. శంకరన్ గురించి ఎంత గొప్పగా చెప్పుకొనేవారో డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి గురించి కూడా అంతే గొప్పగా చెప్పుకొనేవారు. గడ్డం గీసుకొనే బ్లేడు ఉపయోగించి ఆపరేషన్లు చేయగల నైపుణ్యం ఆయనకు వుండేది. ఆయన ప్రత్యేకత పేదలకు మాత్రమే వైద్యం చేయడం. నాలాంటి అధికారులకు ఆయన కూడా ఒక స్ఫూర్తి ప్రదాత. ఆ కాలంలో వి.వి.గిరి తమ్ముడు వెన్నెలకంటి రాఘవయ్య నెల్లూరులో ఒక స్వచ్ఛంద సేవా సంస్థను నడిపేవారు. ఆయన నుంచి కూడా మద్దతు లభించేది. నేను కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు పేదలకు భూములు లభించేట్లు చూశాను. భూస్వాముల నుంచి రకరకాలుగా ఒత్తిడి వచ్చేది. సిపిఎం నాయకుడు గుంటూరు బాపనయ్య నాకు ఎంతో తోడ్పడ్డారు. పి.ఎస్.కృష్ణన్, శంకరన్ లాంటి ఐఎఎస్ అధికారులు ఐఎఎస్‌ల శిక్షణలో కూడా క్రిమినల్ లా, ఎపిసి సెక్షన్లు, సివిక్ ప్రొసీడింగ్స్, పొలిటికల్ సైన్స్, భారత రాజ్యాంగం, హిందీ తదితర అంశాలే ఉంటాయి తప్ప సేవాదృక్పథాన్ని పెంపొందించే విషయాలే ఉండవు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు శంకరన్ ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఈ రాష్ట్రంలో వెట్టిచాకిరీని, దానిలో మగ్గిపోతున్న వారి జీవితాల గురించి మొదట ఆలోచించింది పిఎస్ కృష్ణన్. ఈ విషయంపై ఆయన గ్రామాల్లోకి వెళ్లి సర్వే చేశారు. ఈ వెట్టిచాకిరీ రాజ్యాంగ విరుద్ధమని చెప్పిన ఎస్ఆర్ శంకరన్ దాన్ని నిర్మూలించేందుకు మార్గదర్శకాలను రూపొందించారు. నేటికీ ఈ మార్గదర్శక సూత్రాలనే మన ప్రభుత్వాలు, అధికారులు పాటిస్తున్నారంటే వాటి గొప్పతనమేమిటో అర్థమవుతోంది. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన '20 సూత్రాల విధానం'లో కూడా వీటిని పొందుపరిచారు. వెట్టిచాకిరీని నిర్మూలించాలన్నందుకు అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి శంకరన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై చెన్నారెడ్డితో విభేదించిన శంకరన్ ఆ తర్వాత త్రిపుర రాష్ట్రానికి బదిలీపై వెళ్లారు.

త్రిపురలో ఆయన ఎలాంటి సేవలందించారు?

త్రిపుర సహజంగానే కొండల ప్రాంతం. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలకు సేవలందించేందుకుగాను ఆయన ఐఎఎస్ ఆఫీసర్లు, అధికారులను తీసుకుని కొండ ప్రాంతాల్లో తిరిగేవారు. ఇది ఎంతో కష్టసాధ్యమైనప్పటికీ ఆయన పట్టువదలని విక్రమార్కుడిలా ఆ కొండ ప్రాంతాల్లో సంచరించి సేవలందించేవాడు. శంకరన్ మిత భాషి. తాను చేసిన విషయాలు పెద్దగా చెప్పేవారు కాదు.

ఒక అత్యున్నత స్థాయి అధికారాన్ని నిర్వహించిన శంకరన్ అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. ఇది ఎలా సాధ్యమైంది? ఈనాటి ఐఎఎస్‌లు ఆయన జీవితం నుండి నేర్చుకోవాల్సిందేమిటి?

ఆ రోజుల్లో ఐఎఎస్ అధికారులు గ్రామాల్లోని చావడీల వద్దకు వెళ్లేవాళ్లం. అక్కడ కూర్చుని భూమి శిస్తులు, రుణాలు వసూలు సమీక్షించేవారు. ప్రజల నుండి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేవాళ్లం. ఇందుకు భిన్నంగా పిఎస్ కృష్ణన్, శంకరన్‌లాంటి అధికారులు నేరుగా దళితవాడల్లోకి వెళ్లి అక్కడ సమస్యలపై అధ్యయనం చేసేవారు. ఆ వాడల్లో ఏం దొరికితే అది తినేవారు. లేదంటే ఇంటి దగ్గర రెండు చపాతీలను బాక్సులో వేసుకుని వీలుచిక్కినప్పుడు తినేవారు. పెద్దల ఇళ్లలో భోజనం చేసేవారు కాదు. ఒకసారి ఆయన తన పర్యటనలో ఒక వున్నత కులానికి చెందిన ప్రజాప్రతినిధిని వెంట తీసుకువెళ్లారు. ఒక దళితుడి ఇంటికి వెళ్లి పకోడీ లాంటిదేదో చేయించుకొన్నారు. ఆ ప్రజాప్రతినిధికి కూడా పెట్టించారు. కక్కాలేక మింగాలేక అన్నట్లు ఆ ప్రజాప్రతినిధికి దళితుల ఇంట్లో వండిన పదార్థం తప్పింది కాదు. సందర్భంలో శంకరన్ గురించి, ఆయన వ్యక్తిత్వం గురించి ఒక సంఘటన చెప్పాలనుకుంటున్నాను. ఒకసారి ఆయన ఢిల్లీకి బదిలీపై వెళ్లారు. అక్కడ ఆయనకు ప్రభుత్వం ఒక క్వార్టర్ కేటాయించింది. శంకరన్‌గారి మేనకోడలు ఆ ఇంటి కిటికీలకు, గుమ్మాలకు పరదాలు వేస్తోంది. ఇది గమనించిన శంకరన్ 'దేశంలో ఒళ్లు కప్పుకోవటానికే దుస్తుల్లేక జనం అల్లాడుతుంటే మన ఇంటి గుమ్మానికి పరదాలు అవసరమా?' అని గద్దించారు. అంతే ఆ ఇంటికి ఎప్పుడూ పరదాలు వేయలేదు. దీన్ని బట్టే ఆయన ఎంత ఉన్నతమైన విలువల్ని పాటించేవారో అర్థమవుతుంది. నేటి ఐఎఎస్‌లు ఆయన జీవితం నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఐఎఎస్ ఆఫీసర్లకు ముందుగా సామాజిక దృక్పథం, సేవా స్ఫూర్తి ఉండాలి. ఐఎఎస్ ఆఫీసరు కంటే ముందుగా ఒక సాధారణ వ్యక్తిగా వారు కొన్ని విలువలు పాటించాలి. విలువల్ని పాటించే ఒక అధికారి తన కిందిస్థాయి ఆఫీసర్లు, సిబ్బంది చేత మంచి నాయకుడుగా గుర్తింపు పొందుతాడు. అప్పుడే అతడి స్థాయి, హోదా పెరుగుతుంది. సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది. ప్రతి ఐఎఎస్ అధికారికి స్వీయ నియంత్రణ ఉండాలి. విషయ పరిజ్ఞానం, సత్ప్రవర్తన వల్ల అధికారులకు ఏపని చేయడానికైనా ధైర్యం వస్తుంది. ప్రజలు ఐఎఎస్ ఆఫీసర్ల నుండి చాలా ఆశిస్తున్నారు. ఐఎఎస్ అధికారులు ప్రజలు జవాబుదారీగా ఉండాలి. బాధ్యతగా మసలుకుని ప్రజలకు, తోటి అధికారులకు ఆదర్శంగా నిలవాలి. శంకరన్ జీవితం నుండి నేటి ఐఎఎస్ అధికారులు ఈ విషయాలను నేర్చుకోవాలి.

★

కవిత్వమ్

రాత్రి ఒక నరకయాతన...!

క్షణాలు యుగాల్లా
గడుస్తున్నాయి
రాత్రి ఒక నరకయాతన...!

హృదయాన్ని కోస్తున్న శబ్దం
చిత్రం! ఏమాత్రం
నొప్పి కలగడం లేదు
హాయిగా ఉంది!

ఆలోచనలు
మెదడులో గడ్డకట్టి
భావాలు హృదయంలో
ముప్పిరిగొని
అక్షరాలు శరపరంపరగా
దూసుకొస్తున్నాయి!



ఇపుడు కొత్తగా
రాయడానికి ఏమీలేదు
అందరు చీకి పారేసిన
భావాలు తప్ప!

ప్రేమ ఇంత కొత్తగా
ఉంటుందని ఈరోజే
తెలిసింది.
నా పాత జీవితంలోని
కొంగొత్త మనుషులా!

స్వప్నం నిషిద్ధం
నిజం బహిరంగ స్వప్నసుందరి
ఒక చెలి బట్టలిప్పి
నగ్నత్వాన్ని చూస్తానంటుంది!

గాయపడ్డ హృదయంలో
ఎన్ని గాడాంధకారాలు ఉన్నయో
ఏ గాయకుడు గానం చేయగలడు?

ఇ.వెంకటేష్

పగలే చీకటి

-తమ్మెర రాధిక

వేకువ
కనురెప్పలు విడిపోని
నిదుర జాములు కరిగిపోని
లోగిలి!
గాఢ నిదురలో జోగీ భూగోళం
మేఘాల రెక్కల వింజామరలకు
ఊయల లూగుతోంది.
గాలి పొత్తిళ్లు
వృక్ష తలలను సుతారంగా తడుముతున్నాయి.
ఆ స్పాంతన/ ఘడియే
చిన్న తడలు పెద్ద అలలై
కూకటి వేళ్ళని పెకిలించే కాలం!!
ప్రకృతి-కాలం ఘర్షించుకునే
లిప్తలలో మనిషి
తరాల పర్యంతం వగచే అనుభవం దాగుంది.
తోడును మాయం చేస్తూనో
పొత్తిళ్ళను పొక్కిలిగా మారుస్తూనో
బంధాలకు అర్థాలు వెతుకుతూనో
కలల గూళ్ళను
నేలమట్టం చెయ్యవచ్చు.
రాత్రంతా రాజ్యం చేసిన చీకటి
దిగంతాలను దాటుకు వస్తున్న
వెలుగు రాశుల
పురవడిలో
మనుషుల మస్తిష్కంలో దాక్కోవడానికి వెళ్తోంది.
అందుకే
లోకం ఎంత వెలుగునిచ్చినా
చీకటి గుహలకు
కాలం చెల్లటం లేదు.

ఓ..యువతా...

పేదోళ్ల కూడుకొట్ట
పెద్దోళ్ల కూడబెట్టు
దగాకోరు నాయకులపై
దండెత్తగ రారండి
దండోరా ఇదేనండి
ప్రతినిధులని నిధులు మింగు
పీడితుల పనిపట్టగ
తరలిరండి తరిమేద్దాం.
ఓ యువతా కలిసి కదిలి
రండోయ్ రారండి
సమతా సామ్రాజ్యాన్ని
స్థాపిద్దాం పాలిద్దాం
గ్రామ స్వరాజ్యానికి
స్వాగతం పలకండి
రామరాజు శౌర్యాన్ని
సుభాసుని ధైర్యాన్ని
మేళవించి ఆచరించి
భరతమాత బిడ్డలారా
భవితవ్యం మీదేనండి
జైజవాన్ జైకిసాన్
నినాదాన్ని నిలపండి
నోరారా పలకండి
కడదాకా నిలకడగా

- సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ

నవ్వుల్ - పువ్వుల్

ఏవీరావు

(ఒక పాఠశాలలో తెలుగు టీచర్ విద్యార్థులను ప్రశ్నిస్తున్నారు)

టీచర్: బాబూ! రామాయణాన్ని రాసిందెవరు?

విద్యార్థి: తెలియదు టీచర్.

టీచర్: పాండవులలో మధ్యముడి పేరేంటి?

విద్యార్థి: తెలియదు టీచర్.

టీచర్: రాముడికి సీత ఏమౌతుంది?

విద్యార్థి: తెలియదు టీచర్.

టీచర్: (కోపంగా) నీ పేరైనా తెలుసా నీకు?

విద్యార్థి: ఏవీరావు టీచర్.

దొరికాడా!

పోలీస్ ఇన్స్‌పెక్టర్ : 202 దొంగ దొరికాడా?

కానిస్టేబుల్ : లేదు! ఉరికాడు సార్.

కలలు

రోగి : డాక్టర్! నాకు పీడకలలు వస్తున్నాయి.

డాక్టర్ : ఈ మాత్రలు వాడండి.

రోగి : కలలు రావు కదా! డాక్టర్

డాక్టర్ : అసలు మీకు నిద్ర పట్టేకదా!

ఒంకర్లు

ఆమె : డాక్టర్!ఒళ్లంతా ఒంకర్లు పోతోంది. భయంగా ఉంది.

డాక్టర్ : మీరేం చేస్తుంటారు?

ఆమె : టీవీ యాంకర్‌గా!

డాక్టర్ : నో ప్రాబ్లెమ్

రణం

టీచర్ : గోపీ! పర్యావరణానికి వాతావరణానికి తేడా ఏమిటిరా?

గోపీ : కారణం తెలియదు కానీ రెంటికి రణాలున్నాయి సార్.

సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ
హైదరాబాద్.

పరిశోధన

తండ్రి : ఏరా గోపీ! రోజూ అర్ధరాత్రి దాటాక ఇంటికి వస్తున్నావ్. బుద్ధిలేదా?

గోపి : బుద్ధి వుంది కాబట్టే నాన్నా! ఎంతమంది ఆడపిల్లలు నిర్భయంగా ఇంటికి చేరగలుగుతున్నారో పరిశోధన చేస్తున్నాను.

కొత్త భాష

రామయ్య : ఈ మధ్య మా మనవరాలు ముఖానికి రాసుకునే పౌడర్‌ని బొగ్గడు అంటుంది. బబ్లుగమ్‌ని గగగమ్ అని అంటూ వుంది.

మల్లయ్య: మా మనవడు ఎవరు? అనడానికి ఎవలు అని, కుక్కపిల్లని భౌభౌ అంటున్నాడు. ఎందుకనో తెలియట్లేదు.

సుబ్బయ్య: కొంపదీసి వీళ్లిద్దరూ టీవీ ఎక్కువగా చూస్తున్నారా ఏంటి?

అతి తెలివి

కస్టమర్ (హోటల్‌లో) : వాటర్ గ్లాస్ కంపు కొడుతోంది చూడు!!

సప్లయర్ : రేపటి నుండి సెంట్ పూసి యిస్తానుగాని టిప్స్ ఘనంగా ఇవ్వండి సర్!

జె.సుధాకర్‌రావు పట్నాయక్, కాకినాడ.

వెరైటీ

(సినిమాహాల్లో ఇద్దరు ప్రేక్షకుల సంభాషణ)

రోహిత్ : అదేమిట్రా హాల్లో పట్టుమని పది మంది ప్రేక్షకులు కూడా లేరు. క్లయిమాక్స్‌లో ఈ చప్పట్లు, ఈలల మోతలు ఎక్కడివిరా?

వినోద్: మరేం. అవన్నీ... బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌లో చప్పట్లు, ఈలలు. వెరైటీగా ఉంటుందని మిక్స్ చేశారు.

లైన్

(పార్కులో ఇద్దరు మిత్రుల సంభాషణ)

వినోద్ : లావణ్యకు లైనేస్తున్నావు కదా. ఎంతవరకు వచ్చింది?

కమల్ : మరేం. రెండు లైన్స్ వేసా, బ్రాడ్‌గేజ్, మీటర్‌గేజ్. రెంటిమీద నడవలేక యాక్సిడెంట్ అయి లావణ్యకు పెళ్లయిపోయింది. అంతే.

ఓ.శివరామకృష్ణ, విజయవాడ.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

ఆడపిల్ల పుడితే చాలు! మామిడి మొక్కలు నాటేస్తారు!!

మామిడిచెట్లకు రోజూ నీళ్లుపోసే స్నేహ

బీహార్‌లో ఆడపిల్లకు పెళ్లి చేయడమంటే...మనకు మల్లే పెద్ద సమస్యే. ఆడపిల్ల తరపు వారు అబ్బాయికి పెద్దమొత్తంలో కట్నం సమర్పించుకోవాలి. అయితే పెళ్లికుమారుడికి ఇచ్చే కట్నం అతని కులం, ఉద్యోగం, సామాజిక స్థాయిమీద ఆధారపడి వుంటుంది. ఇంతేకాదు. బీహార్ మరో రకంగా కూడా జాతీయ వార్తలకెక్కింది. వరకట్న హత్యలూ ఇక్కడ ఎక్కువే. అంటే ఈ రాష్ట్రంలో కట్నం బాధ. తర్వాత ఇచ్చిన కట్నం చాల్లేదని అత్తారి ఆరళ్లు. దీంతో ఆడపిల్లలు పుడుతున్నారని తెలిస్తేచాలు భయపడి ముందుగానే అబార్షన్లు చేయించుకుంటున్నారక్కడ. ఫలితంగా స్త్రీపురుష నిష్పత్తిలో తీవ్ర అంతరాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి రాష్ట్రంలోని ఓ కుగ్రామంలో పర్యావరణం, ఆడపిల్ల ఒకరికొకరు అండగా నిలబడుతున్నారంటే నమ్ముతారా! ఆడపిల్ల పుడితే పండుగ చేసుకుంటారని, ఆ సంతోషకర సమయంలో 50 వరకు మామిడి మొక్కలు నాటుతారంటే ఆశ్చర్యంగా వుందికదూ.

నిఖా కుమారి తన తల్లిదండ్రులు, సోదరులతో

అది 1961వ సంవత్సరం. నిర్మలాదేవికి పాప పుట్టింది. ఆ సంతోష సమయంలో ఆమె భర్త 50 మామిడి మొక్కలను పొలంలో నాటాడు. అంతేకాదు. తర్వాత పాప పుట్టినప్పుడు కూడా అంతే చేశారు. ఈ రెండు సందర్భాలలోనే కాదు! తర్వాత వారికి మనవరాళ్లు కలిగినప్పుడు కూడా అంతే చేశారు.

***

పందొమ్మిదేళ్ల నిఖాకుమారి పెళ్లి నిశ్చయమైంది. అయినా ఆమె తండ్రిలో ఏమాత్రం కంగారు లేదు. పెళ్లికయ్యే ఖర్చుల గురించి అణుమాత్రం బాధ లేదు. అతను ఇంత నిబ్బరంగా, ధైర్యంగా వుండడానికి కారణం ఆమె పుట్టినప్పుడు నాటిన మొక్కలే.

***

హర్షితాకుమారి ఇప్పుడు పెళ్లీడు వచ్చింది. ఏమాత్రం కంగారు, బెరుకు లేకుండా ఆమెకు తగిన పెళ్లికొడుకును వెతికే పనిలో వున్నాడు తండ్రి.

***

ఈ సంఘటనలన్నీ ధరార గ్రామంలోనివే. బీహార్ రాజధాని పాట్నాకు 230 కిలోమీటర్ల దూరానున్న చిన్ని గ్రామం ధరార. ఈ కుగ్రామం భగల్పూర్ జిల్లాలో వుంది. ఇక్కడ ఆడపిల్ల పుట్టిందంటే చాలు! సంతోషంతో పళ్ల మొక్కలు నాటుతారు. దాంతో ఆ ఊరంతా పచ్చపచ్చగా మామిడితోపులా వుంటుంది. ఈ మొక్కలు పర్యావరణాన్ని కాపాడడమే కాదు. వాటిమీద వచ్చే ఆదాయంతో ఆడపిల్లల కట్న సమస్యను తీర్చుతున్నాయి. ఆ రాష్ట్ర వ్యాప్తంగా వరకట్న సమస్య వున్నా ఈ గ్రామంలో మాత్రం ఆడపిల్లల తల్లిదండ్రులు ఏమాత్రం కంగారులేకుండా పెళ్లిళ్లు చేసేస్తున్నారు. ఆడపిల్లను, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో రాష్ట్రానికే మోడల్ గ్రామంగా నిలబడింది.

ఆడపిల్ల పుట్టిన ప్రతిసారీ మామిడి మొక్కలు నాటడంవల్ల...నిర్మలాదేవికి ఇవాళ పది ఎకరాల మామిడితోపు వుంది. "ఇంతకీ ఈ అలవాటు ఎప్పటినుంచి వుందంటే కచ్చితంగా చెప్పడం కూసింత కష్టమే. తరతరాలుగా వస్తోంది. ఎప్పుడు ఎలా ఈ ఆచారం మొదలైందో చెప్పడం కష్టం. కానీ ధనిక, పేద అంటూ తేడా లేకుండా... అగ్ర నిమ్న కుల బేధం లేకుండా ఆడపిల్ల పుట్టిన ప్రతి ఒక్కరూ పళ్ల మొక్కలు నాటతారు." అంటుంది 68 సంవత్సరాల నిర్మల. 19ఏళ్ల వయసులో (1957) తన పెళ్లయ్యాక ధరారలో స్థిరపడ్డారామె. ఈ సంప్రదాయం గురించి తన మామగారి నోటెంట విన్నది. ఇక్కడ ఆడపిల్ల పుట్టడమంటే ఇంట్లో లక్ష్మీదేవి పుట్టడంతో సమానం. అందుకే అమ్మాయి పుట్టగానే కనీసం 20 పళ్ల మొక్కలైనా నాటి సంతోషాన్ని పంచుకుంటారు. ధరార గ్రామంలోని ఆడపిల్లలు తమను తాము పర్యావరణ పరిరక్షకులుగా సగర్వంగా చెప్పుకుంటారు. "ఇలా మొక్కలు నాటడంవల్ల పర్యావరణం బావుంటుంది. రోగాలు రావు. పైగా ఇలా పళ్ల మొక్కలు నాటడమంటే ఆడపిల్లకు ఇన్సూరెన్స్ చేయడం వంటిదే. ఎందుకంటే పట్నాల్లో ఆడపిల్ల పెళ్లి ఖర్చుకోసం బ్యాంకుల్లో డబ్బులు ఫిక్స్ డిపాజిట్ చేస్తే ఇక్కడ మేం మొక్కలు నాటుతాం" అంటుంది నిర్మల.

మొక్కలు నాటాక వాటికి కాచే కాయలు, పండ్లు, కలప అమ్మి సొమ్ము చేసుకుంటారు. వచ్చిన డబ్బును పాప పేర డిపాజిట్ చేస్తారు. అలా ఆమెకు పెళ్లీడు వచ్చేవరకు చేస్తారు. ఆ డబ్బుతోనే ఎటువంటి బెంగ లేకుండా తమకు నచ్చిన అబ్బాయిని తీసుకొచ్చి పెళ్లి చేస్తారు. 7వేల జనాభా వున్న ఈ గ్రామంలో ప్రస్తుతానికి 100,000 మామిడి ఇతర ఫలవృక్షాలున్నాయి.

ఈ పద్ధతి అనుసరించడంవల్లే వరకట్న సమస్యను, బాలికల భ్రూణ హత్యల సమస్యను అధిగమించగలిగామని ధరార గ్రామస్తుడు శ్యామ్ సుందర్ సింగ్ అంటున్నారు. ఇప్పటి వరకు ఒక్క వరకట్న హత్యగానీ, భ్రూణహత్యగానీ జరగలేదంటారాయన సగర్వంగా. గ్రామంలోని కురువృద్ధుడు శత్రుఘ్న ప్రసాద్ సింగ్ (86) ఇప్పటి వరకు తన పాతికెకరాల భూమిలో 500 వరకు మామిడిపళ్ల మొక్కలు నాటాడు. ఇప్పుడు తన మనవరాళ్లయిన నిషి, రుచిల పెళ్లిళ్లు చేయడానికి సిద్ధంగా వున్నాడు. సుభాష్ సింగ్ తన కుమార్తె పుట్టినప్పుడు నాటిన పది మామిడిపళ్ల మొక్కలమీద ఇప్పటికి రెండు లక్షల రూపాయలు సంపాదించాడు. ఇప్పుడు ఆ డబ్బుతోనే మంచి అల్లుడికోసం వెతుకులాట మొదలెట్టాడు.

పాట్నాకు చెందిన ఒక ఎన్జీఓ చేసిన అధ్యయనం ప్రకారం అక్కడ వరకట్నాల రేట్లు తెల్సుకుందాం. మెట్రిక్యులేషన్/ ఇంటర్‌మీడియట్ పాసయిన అబ్బాయికి 50, 000 రూపాయలు... గ్రాడ్యుయేట్/ పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసిన అబ్బాయిన 79, 000, నాల్గవ తరగతి ఉద్యోగికి లక్షన్నర, మూడవ తరగతి ఉద్యోగికి రెండున్నర లక్షలు, రెండవ తరగతి ఉద్యోగికి నాలుగు లక్షలు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకైతే 2,500,000 కట్నంగా ఇచ్చుకోవాలి. అదే వ్యాపారం చేసే అబ్బాయైతే 150,000 నుంచి 500,000 రూపాయల వరకు ఇచ్చుకోవాలి. ఇప్పుడు పళ్ల మొక్కలమీద వస్తున్న ఆదాయంతో తాము పెట్టగలిగిన కట్నాన్ని బట్టి పిల్లవాణ్ణి ఎంచుకుంటున్నారు. గొప్ప విషయమేంటంటే... తాము నాటిన మొక్కలకు తమ ఆడపిల్లల పేర్లే పెడతారు. సరస్వతి, ఆర్తి, కాజోల్...ఇలా. మొక్కలను తమ కన్నబిడ్డలవలే చూసుకుంటున్నారనడానికి ఇదొక నిదర్శనం. అసలు వరకట్నం ఇవ్వడం తీసుకోవడం తప్పన్న విషయాన్ని పక్కన పెడితే ఆడపిల్ల పుట్టగానే చంపేయకుండా ఇలా మొక్కలు నాటి వరకట్న సమస్యను పరిష్కరించుకోవడం మంచి ఆలోచనేనంటారా! ★

ఆన్‌లైన్ ఫొటోషాప్

నేవిగేటర్

లేయర్స్ ప్యాలెట్

హిస్టరీ ప్యాలెట్

ఫొటోషాప్... కంప్యూటర్ తెలిసిన వారందరికీ దాదాపుగా సుపరిచితమైన ఇమేజ్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్. డిజైనింగ్ రంగంలో ఎక్కువగా ఉపయోగించబడుతోన్న సాఫ్ట్‌వేర్ ఇది. ప్రస్తుతం 'ఫొటోషాప్ సిఎస్-5' వెర్షన్‌గా యానిమేషన్ ఫీచర్స్‌ను సైతం తనలో నిక్షిప్తం చేసుకొని అలరిస్తోన్న దీని రేటు కూడా తక్కువేమీ కాదు. 109 డాలర్లు (సుమారుగా రూ.44వేలు). అంతేస్థాయిలో ఫీచర్స్‌ను కూడా అందిస్తోంది. 'కొరెల్ ఫొటో పెయింట్' వంటి ఇతర కొన్ని సాఫ్ట్‌వేర్స్ వున్నా, ఫొటోషాప్‌కున్న పాపులారిటీ లేదు. అయితే ఫొటోషాప్‌ను సవాల్ చేయగలిగే స్థాయిలో వున్న ఒకే ఒక్క సాఫ్ట్‌వేర్ 'జింప్' (GIMP). ఇదొక ఓపెన్‌సోర్స్ (ఉచితం) ఇమేజ్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్. ప్రస్తుతం 2.6 వెర్షన్‌గా లభ్యమయ్యే దీన్ని ఇంటర్నెట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దీనిలో వచ్చే అప్‌డేట్స్ అన్నిటిని కూడా ఉచితంగా పొందవచ్చు. ఫొటోషాప్ అయినా జింప్ అయినా లేదా ఇతర ఇమేజ్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్స్ ఏవైనా వాటిని కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని మాత్రమే వాడుకోగలుగుతాం. డౌన్‌లోడ్స్, ఇన్‌స్టాలేషన్స్ వంటి ప్రక్రియలేమీ లేకుండా ఫొటోషాప్ నమూనాలో, దాదాపు ఫొటోషాప్‌లోని టూల్స్, ఆప్షన్స్ వున్న "ఆన్‌లైన్ ఫొటోషాప్" ఇప్పుడు నెట్‌లో ఆవిష్కృతమైంది. దీన్ని ఉపయోగించుకునేందుకు నెట్ కనెక్షన్ వుంటే చాలు.

మహీగ్రాఫిక్స్ డాట్ కామ్ వారు అందిస్తున్న ఈ 'ఆన్‌లైన్ ఫొటోషాప్' ఒక వెబ్‌సైట్. ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేసుకోగానే వచ్చే ఓపెన్ పేజీ ఫొటోషాప్‌ను తలపించే రూపలావణ్యం కలిగివుంటుంది. మెనూబార్, టూల్స్ ఆప్షన్ బార్, టూల్స్‌బార్, లేయర్స్, హిస్టరీ, నేవిగేటర్ వంటి ప్యాలెట్స్‌తో దర్శనమించే ఆన్‌లైన్ ఫొటోషాప్ అబ్బురపరచకమానదు. ముఖ్యంగా టూల్స్‌బార్ ఆకర్షణీయంగా వుంది. ఈ టూల్‌బార్‌లో మొత్తం 27టూల్స్ వున్నాయి. ఇవన్నీ ఫొటోషాప్‌లో వున్నవే. ఉపయోగించడంలో కూడా ఏమాత్రం తేడాలేదు. అంతేకాకుండా దీనిలో లాంగ్వేజ్ అనే ఆప్షన్ నుండి 23 భాషలు లభ్యమవుతాయి.

ఈ ఆన్‌లైన్ ఫొటోషాప్ ఓపెన్ కాగానే మొదట ఎడిటర్ అనే బాక్స్ ఒకటి స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. దీనిలో మూడు ఆప్షన్లు వుంటాయి. 1. క్రియేట్ ఎ న్యూ ఇమేజ్ 2. ఓపెన్ ఇమేజ్ ఫ్రం కంప్యూటర్ 3. ఓపెన్ ఇమేజ్ ఫ్రం యుఆర్ఎల్. మొదటిది ఎంపిక చేసుకుంటే న్యూఇమేజ్ అనే చిన్న బాక్స్ వస్తుంది. దీనిలో నేమ్, ప్రీసెట్స్, విడ్త్, హైట్‌ల ఎంపిక చేసుకొనే వీలుంది. ప్రీసెట్స్‌లో డీఫాల్ట్‌గా కొన్ని సైజ్‌లు వుంటాయి. వాటిని ఎంపిక చేసుకోవచ్చు. లేదా కావాల్సిన సైజ్‌లను టైప్ చేసుకోవచ్చు. ఇది ఓకె చేసుకోగానే కొత్త పేజీ క్రియేట్ అవుతుంది. ఇక దానిలో పనిచేసుకోవడమే తరువాయి. ఇక ఎడిటర్‌లోని రెండో ఆప్షన్‌పై క్లిక్ చేస్తే మన కంప్యూటర్‌లోని ఫోల్డర్ ఓపెన్ అవుతుంది. అందులోని అవసరమైన ఇమేజ్‌లను ఎంపిక చేసుకోవచ్చు. మూడవ ఆప్షన్ ద్వారా నెట్ నుండి ఇమేజ్‌లను ఇసుకునేందుకు వీలుగా రూపొందించబడింది. ఎడిటర్‌ను ఉపయోగించకుండా కొత్త పేజీ ఓపెన్ చేసుకోవాలంటే... ఎడిటర్ బాక్స్‌లో పైన వున్న క్లోజ్ బటన్‌పై క్లిక్ చేస్తే, ఎడిటర్ బాక్స్ పోయి, ఫొటోషాప్ డెస్క్‌టాప్ కనిపిస్తుంది. ఫొటోషాప్‌లో మాదిరిగానే మెనూబార్‌లోని ఫైల్ మెనూ నుండి కొత్త పేజీని ఓపెన్ చేసుకోవచ్చు.

ఫొటో ఎడిటింగ్, రీసైజ్, లోగోస్ క్రియేషన్ వంటివి అన్నీ చేయవచ్చు. ముఖ్యంగా నెట్ బ్రౌజింగ్ సెంటర్స్‌లో ఇమేజ్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్స్ వుండవుగనుక అటువంటి చోట ఇది మంచి ఉపయోగకరంగా వుంటుంది. ఆసక్తి వుంటే http://mahigrafix.com/photo-shop_online/ సైట్ ఓపెన్ చేసి చూడొచ్చు.

- రాజు.కె.ఎక్స్

వియత్నాం వీరుడు
ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

జరిగినకథ:

వాన్‌ట్రాయ్‌ని పోలీసులు అరెస్టు చేస్తారు. బంధీగా వున్న అతనిని చూచి కుయేన్ ఎంతగానో విచారిస్తుంది. పోలీసులు అతణ్ణి తీసుకొచ్చి వారి ఇంట్లోనే విచారణ మొదలెడతారు. ట్రాయ్‌ని విచక్షణా రహితంగా కొడతారు. వంటిమీద బట్టలన్నీ పేలికలైపోతాయి. వళ్లంతా రక్తసిక్తమౌతుంది. మధ్యమధ్యలో కుయేన్‌ను, ట్రాయ్‌ను ప్రశ్నలు వేస్తారు. ట్రాయ్ పేలుడు సామాగ్రిని ఎక్కడ దాచిందీ చెప్పమని ఇద్దరినీ అడుగుతారు. ఆమె తనకు తెలీదంటుంది. ఆ క్షణాల్లో భర్తను చూచి మనసు ద్రవించి పోతుందామెకు. తీవ్రమైన గాయాలతో, బాధలో వుండికూడా తనెంతో ప్రేమగా చూసిన భర్తమీద ఆమెకు ఎనలేని ప్రేమ పొంగుకొస్తుంది. అతడిని తను ఎంతగా అపార్ధం చేసుకొన్నదీ గుర్తుచేసుకొని మనసులోనే బాధపడుతుంది. తర్వాత పోలీసు అధికారి కుయేన్‌ను ప్రశ్నలు వేయడం మానివేసి చిత్రహింసా గృహంలోకి తీసుకెళతాడు. ఆ తర్వాత....

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

మూడవ భాగం

ఆ గది పైకప్పులోంచి లావాటి తాళ్ళు వేళ్ళాడుతున్నాయి. ఖైదీలను ఆ తాళ్ళతో కట్టి వేళ్ళాడదీసేందుకు. కాన్‌వాస్ సంచులు కూడా ఉన్నాయి. శవాలను కట్టేందుకు.

సబ్బుపొడి ఉంది నీళ్ళలో కలిపి బలవంతాన తాగించడానికి.

ఒక పెద్ద నీళ్ళ తొట్టి గూడ ఉంది. ఖైదీలను అందులో తోసి చిత్రహింసలు పెట్టడానికి. ఈ విధంగా అనేక రకాల హింసాకాండ పద్ధతులు!

అతడు ఇలా బెదిరించాడు.

'మీరు మమ్మల్ని బుద్ధిహీనులను చేస్తే ఈ పరికరాలన్నీ మీకోసమే'.

మధ్యరాత్రి రెండుగంటలయింది. మమ్మల్ని మళ్ళీ ప్రశ్నలడిగేందుకు విచారణ గదిలోకి తీసుకెళ్ళారు. ముందు ముందు రాబోవు భయంకరమైన పరిస్థితుల గురించి చాలా భీతి చెందాను. జైల్లో ప్రతి కొట్టుకూ మమ్మల్ని తిప్పారు. ప్రతి కొట్టుల్లోకి వొంగి పారజూశాను. ఎక్కడా ట్రాయ్ వున్నట్టు అలికిడి కూడా కనపడలేదు.

"నేను పోలీసు సూపరింటెండెంటును అడిగాడు. 'నా భర్త నన్ను చూడాలని కోరుకున్నట్లు చెప్పారు ఆయన ఎక్కడ?'

'విచారణ కోసమని నిన్న మధ్యాహ్నం ఇక్కడే ఉన్నాడు. ప్రభుత్వం యొక్క పునర్వ్యవస్థీకరణ విధానం అతనికి వివరించాం. అతని దుష్కృత్యాలకు పశ్చాత్తాప పడమన్నాం, వియత్కాంగ్ నుంచి వేరు పడమన్నాం. ప్రభుత్వ (కీలుబొమ్మ-అను) పక్షాన నిలిచేందుకు ఆహ్వానించాం. మీరిద్దరూ మళ్ళీ హాయిగా కలిసి వుండేందుకు సమ్మతించాడు. కాని ఒక విషయం నీకు తెలియచేయడానికి విచారిస్తున్నాను. అతడు కిటికీలోంచి దూకాడు, కాలు విరిగిపోయింది. ఇప్పుడు 'చోలే' ఆసుపత్రిలో ఉన్నాడు."

పిచ్చెక్కినట్లు పెద్దగా అరచి ఏడ్చాను.

"ఆయన్ను మీరు చితగ్గొట్టారు. అది చాలక తానే కిటికీ లోంచి దూకాడని ప్రజల్ని నమ్మించ జూస్తున్నారా?

వెంటనే అతడిలా అన్నాడు.

'ఎందుకిలా చిందులు తొక్కుతున్నావు మధ్యరాత్రిలో? నిజం చెప్పాను. త్వరలో నువ్వే తెలుసుకుంటావు. నీకు తెలియకుండా దాచిపెట్టాలని ప్రయత్నించడంలేదు.'

'నా భర్త ఆసుపత్రిలో ఉన్నాడు కదా. నన్ను ఇంటికి వెళ్ళనివ్వండి.'

'నీకేమీ తెలియదు కదూ! సరే. ఇక తెలుసుకోవచ్చు' చమత్కరించాడు.

నన్ను అరెస్టు చేశారని అప్పుడే తెలుసుకున్నాను. నన్ను పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉంచారు. బట్టలు, బ్లాంకెట్లూ తెచ్చుకుంటానని మొరపెట్టుకున్నా కూడా నన్ను ఇంటికి వెళ్ళనివ్వలేదు. ప్రతి దినమూ విచారణ గదిలో ప్రశ్నలు అడిగేవాళ్ళు. బలవంతాన దానికి హాజరయ్యే వాళ్ళం.

మెక్‌సమారా హత్యాప్రయత్నంతో సంబంధం వున్నదని అనుమానించబడ్డ ప్రజల్ని ప్రశ్నించడం, చితకబాదడం అక్కడ జరుగుతూండేది.

ఆ విధంగా క్రూరంగా హింసించబడ్డ వాళ్ళలో లోయ్ ఒకడు. ట్రాయ్‌ని అరెస్టు చేసిన ప్రాంతంలోనే లోయ్‌నిగూడ అరెస్టు చేశారు. ఒకనాటి సాయంత్రం జైల్లోంచి ఉడాయించడానికి విఫలయత్నం చేశాడు ట్రాయ్. అయితే లోయ్ మాత్రం చేతి సంకెళ్ళను ఛేదించడంలోను, జైలు గోడెక్కి కిందికి దూకడంలోను విజయం సాధించాడు. కానీ లోయ్ మళ్ళీ ఈ దుర్మార్గుల చేతికి చిక్కాడు.

లోయ్‌ని మొట్టమొదట ఇక్కడ చూశాను. ఇతని వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు మాత్రమే. ట్రాయ్, లోయ్ లిద్దరిదీ ఒకే గ్రామం. లోయ్ మొదట నిర్బంధంలో వున్నప్పుడు అతని చూపులను చూసి తోటి ఖైదీలు అసహ్యించుకునేవాళ్లు. అతని తల

వెంట్రుకలు కళ్ళనూ, మెడనూ కప్పేసి వుండేవి. అందువల్ల అతను రౌడీవలె కనబడేవాడు.

జైల్లో తనతోటి ఖైదీలు అతణ్ణి గూర్చి తర్వాత బాగా అర్ధం చేసుకున్నారు. లోయ్ మంగలిషాపు కెళ్ళి అక్కడ పనిచేసి శుభ్రంగా క్షౌరం చేయించుకొచ్చాడు. ఇదంతా అధికారి అనుమతి మీదనే జరిగింది. ఖైదీలను చాలా బాగా చూస్తోన్నారన్న ప్రచారపుటెత్తుగడల కోసం అలా అనుమతి యిచ్చారు.

మెక్‌నమారా హత్యా ప్రయత్నంలో లోయ్‌కి సంబంధం వున్నదని తెలుసుకున్న తర్వాత తన సహచరులు అతణ్ణి చాలా బాగా చూశారు. విచారణ గదిలో లోయ్‌ని లాఠీలతో కొట్టి హింసించారు. లోయ్‌కి సానుభూతి చూపుతూ పెద్దగా అరవలేక పోయాను. ఎందువల్లనంటే ఇంతకన్నా అధికాధికంగా ట్రాయ్‌ని చిత్రహింసలు పెట్టారు కదూ!"

కొట్టేకొద్దీ మాట్లాడడానికి కూడా శక్తిలేక కృంగిపోయేవాడు. దెబ్బలు భరించలేక స్మృహతప్పి పడిపోయిన లోయ్‌ని ఆ గదిలో ఒకమూల తోసే వాళ్ళు.

ఒకసారి మేము బైట నుంచి భోజనం తెచ్చుకోవడానికి అనుమతించబడ్డాం. అప్పుడు కొన్ని నిముషాలు మాత్రం లోయ్‌ని కలవడం తటస్థించింది.

లోయ్ నాతో ఇలా అన్నాడు హుషారుగా.

'ఈ పోలీసు ముష్కరులకు ట్రాయ్ ఏమి చెప్పాడో తెలుసా? ప్రతి విషయం తానే చేశాననీ, ఇతరులెవ్వరికీ జోక్యం లేదనీ చెప్పాడు. పోలీసులు ఆయన్ని కొట్టే కొలది మళ్ళీ మళ్ళీ ఈ విషయాన్నే పునరుద్ఘాటించాడు. నిజంగా చాలా ధైర్యశాలి. ఆయన కిటికీలోనుంచి దూకినప్పుడు, నేను అక్కడే వున్నాను. కిటికీలోంచి కిందికి దూకాడు. కాని పోలీసులు కళ్ళు కట్టి తప్పించుకుపోయేందుకు అక్కడ మోటారుకారు సిద్ధంగా లేదు...'

తరువాత రెండవ నేరస్తుడు 'హువా' ట్రాయ్‌కి చుట్టం. అతనికి పదిమేడు సంవత్సరాల ప్రాయం. ట్రాయ్ పనిచేసిన వర్కుషాపులోనే ఇతడూ చేశాడు. ట్రాయ్ కార్యకలాపాలకు హువా సహాయకుడని అనుమానించి అరెస్టు చేశారు. అతణ్ణి చితక బాదారు. చిత్రహింసలు పెట్టారు.

ఏమైనప్పటికీ దెబ్బలు కొట్టేకొలదీ అతను యిలా జవాబిచ్చేవాడు.

'నాకు తెలిసిందల్లా మా మామగారు మాత్రమే, ఫ్యాక్టరీ అధికారి అప్పగించిన పనులు చేస్తుండేవాడు. అంతకంటే నాకేమీ తెలియదు.

***

మూడు రోజుల తర్వాత ట్రాయ్‌ని చూడ్డానికి నన్ను తీసుకెళ్ళాడు పోలీసు సూపరింటెండెంటు, మేము కారులో పోతున్నప్పుడు ఒక బజారు చూపించి ఇలా అన్నాడు.

'అటు చూడు ఎంత బుద్ధిలేనివాడు ట్రాయ్! ప్రజలు వాళ్ళ వాళ్ళ పనుల్లోకి వెళ్ళడం రావడం. అబ్బ! ఎంత ఆనంద కోలాహలం! వియత్నాంగు దుర్బోధలు విన్నాడు నీ భర్త. అందుకు ఫలితం అనుభవిస్తున్నాడు. అతడేమో ఒక కొట్లో బంధించబడ్డాడు. వాడి పెళ్ళాం మరో కొట్లో.

అతడు అనేక విషయాలు చెప్పుకుపోతూనే ఉన్నాడు. ఇంజను శబ్దానికి వినపడ్డంలేదు. అక్కడక్కడ ఒక్కొక్క ముక్క మాత్రం వినపడ్డాయి. ఒక ఉపన్యాసంవలె ఉంది. ఛోరే ఆసుపత్రి మెయిన్ గేటు దగ్గర కెళ్ళాం. అక్కడ నా భర్తకోసం ఎంతో ఆతృతతో కొన్ని పండ్లు కొన్నాను.

ట్రాయ్ ఒక గదిలో బంధించబడి వున్నాడు. ఆ గదిలో ఆయనతో బాటు మరో ఆరుగురు ఉన్నారు. బయటి ప్రపంచంతో వారికి సంబంధమే లేదు. ఇనప వలతో మూయబడి వుంది. ఆ గది. కిటికీ అద్దాలను మంచు కప్పేసింది. వాకిలిని మూసివేసినట్లు కొంతమంది పోలీసులు కాపలా కాస్తున్నారు.

నేను లోపలికి అడుగుపెట్టాను, ట్రాయ్ నన్ను చూశాడు. లేచి కూర్చోడానికి ప్రయత్నించాడు. కాని లేవలేకపోయాడు. పడుకొని వున్న వాడల్లా అలా పైకి లేచి కూర్చోడానికి భుజం ఆదరవు చేసుకోవాల్సి వచ్చింది.

ఇలా అన్నాడు ట్రాయ్

"అరెస్టు అయిన వాళ్ళంతా విడుదల అయ్యారా?"

పడకమీద ఆయన పక్కనే కూర్చున్నాను. ఆయన కార్యకలాపాలతో సంబంధం వుందనుకొని అనుమానించబడిన వాళ్ళనంతా అరెస్టు చేశారు. వాళ్లంతా క్రూరమైన చిత్రహింసల వాతబడ్డారు.

ఆయనకు మనో నిబ్బరం కలిగించేందుకు ఇలా అన్నాను.

'వాళ్ళంతా విడుదలయ్యారు. ఏమీ మధన పడవద్దు. నేనొక్కర్తెనే మిగిలి ఉన్నాను.'

ఆయన చాలీ చాలని పొట్టి దుస్తులు ధరించి ఉన్నాడు. ఎద బట్టబయలుగా కనబడుతోన్నది. పిడికిళ్ళతో గుద్దడం వల్ల, లాఠీలతో కొట్టడం వల్లనూ ఎదరొమ్ము అంతా ఎర్రబారి పోయింది. పొత్తికడుపు కింది నుండి కాలి మడమవరకు దట్టంగా మందుపట్టీ (ప్లాస్టర్) వేయబడి వున్నది. చాలా సన్నగా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకు గుంజుకుపోయాయి. గడ్డం బాగా పెరిగింది. ప్రత్యేకించి ముఖం, నుదురు గాయాలమయం. ఆయన్ను చూడ్డంతో దుఃఖించడం తప్ప ఇంకే విధంగానూ సహాయపడలేకపోయాను.

నేనిలా అడిగాను.

"నొప్పి వేస్తుంది కదూ ఊఁ"

"అబ్బే. అంతగా లేదు. నిద్ర బాగా పడ్తోంది. నిన్ను బాగా కొట్టివుంటారు."

"లేదు" అన్నాను.

"నిజంగానా?"

"ఏదీ, నావైపు ఇలా చూడు వాళ్ళు అనేక ప్రశ్నలడిగారు"

నా చేతులు గట్టిగా అదిమి పట్టుకున్నాడు. ప్రేమతో జాలిగా నా ముఖంలోకి ఆయన చూశాడు.

జీర వారిన గొంతుకతో ఇలా అన్నాను.

"నన్ను క్షమించండి! ఆ రోజు సాయంత్రం మీరు ఇల్లు వదిలి బయటకు వెళ్ళారు కదా! అందుకు మీపైన చిరచిరలాడాను. కోప్పడ్డాను. అవన్నీ మరచిపోండి. క్షమిస్తారు కదూ..."

ఒక చిరునవ్వు నవ్వాడు. ఆయన బుగ్గలు సన్నగా ముడతలు పడ్డాయి.

"లేదు అదంతా నా పొరపాటు. నీమీద నాకేం కోపం లేదు. నిన్ను ప్రేమిస్తున్నాను. గాఢంగా ప్రేమిస్తున్నాను కుయేన్"

పోలీసు సూపరింటెండెంటు మాకు అంతరాయం కలిగించాడు.

"ఊఁ (ఊఁ! ఆగండి. మీరు మళ్ళీ ఇంటికెళ్ళినప్పుడు ఇటువంటి వ్యవహారాలు మాట్లాడుకోవచ్చు. మీరిద్దరూ కలిసి హాయిగా జీవించేందుకు నేనున్నాను సహాయపడ్డానికి"

ట్రాయ్ వైపు తిరిగి ఇలా అన్నాడు

"నీ అంతట నువ్వే కిటికీలోంచి ఎందుకు దూకావు? ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణ విధానం నీకు వివరించాలనుకున్నాను. ప్రభుత్వ దయార్ద్రతను నువ్వు అర్ధం చేసుకొని వియత్నాంగుకు దూరమైతే తిరిగి ఇంటికి వెళ్ళేందుకు అనుమతి లభిస్తుంది. చాలా సంతోషించదగ్గ విషయంకాదూ ఇది? ఈ విషయాన్ని నీకు వివరించాలని తీవ్రంగా ప్రయత్నించాను. నీవు"

ట్రాయ్ తీవ్రంగా అడ్డుకున్నాడు.

"ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణ విధానాన్ని నాకు వొంటబట్టించేందుకు అనుసరిస్తున్న మీ నైపుణ్యాన్ని, ప్రతిభను వృధా చేసుకోవద్దు."

పోలీసు సూపరింటెండెంటు కొంచెం తగ్గాడు. ఓదార్చుతున్నట్లు ఇలా అన్నాడు.

'ఈ వ్యవహారంలో ప్రధాన నేరస్తుడవు నువ్వు కాదని నాకు తెలుసు. వాడు వేరే ఉన్నాడు'

"ఊఁహూ!" అంటూ తలూపాడు ట్రాయ్?

"నేరమూ లేదు... నేరస్తుడూ లేదు. అది ఒక ప్రతిభ. అమెరికా దురాక్రమణదారులను మట్టుపెట్టే కార్యక్రమంలో ఇది ఒక గొప్ప విశేషం. నేను నేనొక్కణ్ణే మెక్ నమారాను హతం చేయాలని పూనుకున్నాను. ఇందులో ఎవ్వరి జోక్యం లేదు"

సూపరింటెండెంటు ట్రాయ్‌ని మరపించి ఇంకా ఎక్కువ విషయాలను సేకరించేందుకు ప్రయత్నించాడు.

"అమెరికా అగ్రనాయకుల్లో ఒకరిని హత్య చేసేందుకు తీవ్రంగా కుట్ర పన్నావన్న నేరం చేశావని నీకు తెలియదా?"

"అమెరికా సామ్రాజ్యవాద ప్రధాన నాయకుల్లో ఒకడు కాబట్టే నా ప్రాణం సైతం లెక్కచేయకుండా అతణ్ణి హతం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించాను."

పోలీసులు ఆయన పడకచుట్టూ చుట్టవేశారు. ఒకళ్ళనొకళ్ళు చుర చురా చూసుకున్నారు.

ట్రాయ్‌ని మళ్ళీ చిత్రహింసలు పెట్టేందుకు పోలీసులు గజ్జిపట్టిన వాళ్ళవలె ఉపక్రమించారు.

(తరువాయి భాగం వచ్చేవారం)

చూద్దాం

శ్రీశైల క్షేత్రంలో ఎన్ని విశేషాలో...


పాలధార పంచధార

శ్రీశైలక్షేత్రం కేవలం భక్తి భావాలను, ఆధ్యాత్మిక తత్వాన్ని మేళవింపజేసుకోవడమే కాకుండా ఎన్నో చారిత్రక విశేషాలను స్వంతం చేసుకొని మన వారసత్వ వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. అంతేకాకుండా భౌగోళిక అంశాలు, ప్రకృతి అందాలు శ్రీశైలానికి మరింత ప్రత్యేకతను సంతరించి పెట్టాయి. అందుకే శ్రీశైలాన్ని ఒక అరుదైన ప్రదేశంగా పేర్కొనవచ్చు. దట్టమైన అడవులతో, ఎత్తైన కొండలతో, అందమైన లోయలతో, గలగల పారే సహజ జలధారలతో, ఒంపుసొంపుల కృష్ణమ్మ ప్రవాహంతో, సాంస్కృతిక వారసత్వ సంపదతో, ఆలయ కళావైభవానికి ప్రతీకగా చెప్పదగిన నిర్మాణాలతో అలరారే శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి తీరవలసిందే.

శ్రీశైలానికి 8 కి.మీ. దూరంలో రోడ్డును ఆనుకొని శిఖరేశ్వరం వుంది. శ్రీశైలం కొండల్లో అతి ఎత్తైన కొండశిఖరం యిదే. దీని ఎత్తు సముద్రమట్టానికి 898 మీటర్లు (2830 అడుగులు). ఈ శిఖరేశ్వరంలో ప్రాచీనమైన వీరశంకర ఆలయం, ఆలయం పైభాగంలో ఒక రోలు, దానిలో ఒక పాత్రంపై నంది అమర్చబడివున్నాయి. భక్తులు ఆలయ పైభాగానికి వెళ్ళి, అక్కడున్న రోటిలో నువ్వులు పోసి, పాత్రాన్ని తిప్పి, నందికొమ్ములపై నుండి శ్రీశైల ప్రధానాలయాన్ని చూస్తారు. ఎత్తైన ఈ ప్రదేశం నుండి చూసినప్పుడు కనబడే శ్రీశైల దృశ్యం ఎంతో మనోహరంగా వుంటుంది.

పాలధార - పంచధార

హఠకేశ్వరానికి ఎదురుగా రోడ్డుకు యివతలి వైపున గల లోయ ప్రాంతమే పాలధార - పంచధార. ఇక్కడ ఎత్తైన ప్రదేశంలో బండరాళ్ళ నుండి, దాదాపు పక్కపక్కగా ఒకచోట ఒక జలధార, మరోచోట అయిదు జలధారలు నిరంతరం ప్రవహిస్తూనే వుంటాయి. ఈ ప్రవాహపు తీరు పర్యాటకులను మంత్రముగ్దుల్ని చేస్తుంది.

ప్రాకార కుడ్యం - ప్రత్యేకతలు

శ్రీశైలంలోని ఆలయ ప్రాకారకుడ్యం భారతీయ శిల్పంలోనే ఒక ప్రత్యేకతను కలిగివుండి, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. దాదాపు 2,79,300 చదరపు అడుగుల వైశాల్యం గల ప్రధాన ఆలయ ప్రాంగణం చుట్టూ సుమారు 20 అడుగుల ఎత్తు, 2121 అడుగుల పొడవుగల కోటగోడ వంటి నిర్మాణమే ప్రాకారకుడ్యంగా


అక్క మహాదేవి గుహ

చెప్పబడుతోంది. 3153 రాళ్ళను వుపయోగించి నిర్మించిన ఈ ప్రాకారంలో యించుమించుగా బయటివైపుగల అన్ని రాళ్ళపై శిల్పాలు చెక్కబడ్డాయి. ఈ ప్రాకారకుడ్యంలోని ప్రతిరాయిని ఒక కళాఖండంగా పేర్కొనవచ్చు. ఈ కుడ్యం క్రీ.శ.1412 ప్రాంతంలో నిర్మించబడింది. ఈ ప్రాకార కుడ్యంపై శ్రీశైల స్థల కథలకు సంబంధించిన శిల్పాలు, పురాణాలలోని పలుగాథలకు సంబంధించిన శిల్పాలు, దేవతాశిల్పాలు, సిద్ధుల శిల్పాలు, వృక్ష, జంతు శిల్పాలు, యింకా పలు అలంకారిక శిల్పాలు, సామాజిక శిల్పాలు వున్నాయి. ఈ శిల్పాలు ఆనాటి సమాజం యొక్క ఆధ్యాత్మిక వ్యక్తిత్వం, వేషధారణ, విలాసాలు, యుద్ధరీతులు, అప్పటి నృత్యాలు, కళారీతులు మొదలైన వాటన్నిటినీ సూచిస్తూ, అప్పటి సామాజిక జీవన వైవిధ్యాన్ని సూచిస్తున్నాయి.

వీర శిరోమండపం

శ్రీశైల ప్రధానాలయంలో స్వామి వారి ఆలయం ఎదురుగా గల వీరశిరోమండపం ఎంతో చారిత్రక ప్రాశస్త్యం వుంది. ఈ మండపాన్ని క్రీ.శ.1377లో రెడ్డి రాజులు నిర్మించారు.

ఈ మండపంలో భక్తులు వీరావేశంతో తమ తలలను, కాళ్ళు చేతులను, నాలుకలను, కుత్తుకలను గండ కత్తెరలతో నరుక్కునేవారని, ఈ మండప నిర్మాణ సందర్భంగా వేయించిన శిలాశాసనం చెబుతోంది. ఈ సాహస కృత్యాలకే 'వీరాచారం' అని పేరు. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో యిలాంటి సాహస కృత్యాలు వర్ణించబడ్డాయి. ఆలయ ప్రాకార కుడ్యంపై కూడా యిలాంటి వీరాచార శిల్పాలున్నాయి. శ్రీశైలంలో యిలాంటి సాహసకృత్యాలకు ఒక మండపమే ప్రత్యేకంగా నిర్మించబడిందంటే, శ్రీశైల సంస్కృతిలో ఈ సంప్రదాయానికి గల ప్రాధాన్యమేమిటో అర్థమవుతోంది.

ట్రైబల్ మ్యూజియం

శ్రీశైలంలో పర్యాటకులు తప్పకుండా చూడవలసిన వాటిలో ఈ ట్రైబల్ మ్యూజియం



పాతాళగంగ సమీపాన కొండ



గిరిజన మ్యూజియం ప్రధాన మార్గం

అక్కమహాదేవి గుహలు

ఒకటి, గిరిజన సంస్కృతీ సంప్రదాయాల సమాహారంగా చెప్పదగిన ఈ మ్యూజియం 2003లో ఏర్పాటు చేయబడింది. ఆదిమవాసుల సంప్రదాయ విశేషాలను తెలియచెప్పే ఈ ప్రదర్శనశాల కొన్ని వేల సంవత్సరాల విశేషాలను మన కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తుంది. ఈ మ్యూజియంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో చేసిన ఆదిమవాసుల నిలువెత్తు బొమ్మలు నిజంగా వారు మన ముందున్నట్లుగా భ్రాంతిని కలుగచేస్తాయి. పామును ఆడిస్తున్న చెంచు, తప్పెట వాయిస్తున్న చెంచు, డోలు వాయిస్తున్న గిరిజనుడు, శివకథ చెబుతున్న చెంచు, వేణువు ఊదుతున్న గిరిజనుడు, శివునికి సోది చెబుతున్న ఎరుకలసాని మొదలైన మూర్తులు ఈ మ్యూజియంలో వున్నాయి. ఇక్కడ యిలాంటి మూర్తులను 20 దాకా చూడవచ్చు. ఇంకా 33 గిరిజన తెగలకు చెందిన రకరకాల వాయిద్యాలు, వారి ఆభరణాలు, వారి వివిధ వస్తువులను కూడా ఈ ప్రదర్శనశాలలో చూడవచ్చు.

అక్కమహాదేవి గుహలు

శ్రీశైలంలోని అక్కమహాదేవి గుహలు భౌగోళికంగా ఎంతో ప్రత్యేకతను కలిగి వున్నాయి. అక్క మహాదేవి గుహలను యిక్కడ పాతాళగంగ మెట్లను దిగి, దాదాపు 10 కి.మీ. నదిలో ప్రయాణించి చేరుకోవచ్చు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అయితే 12 కి.మీ. ప్రయాణించాల్సి వుంటుంది.

పన్నెండవ శతాబ్దంలో వీరశైవ శివశరణులలో ప్రసిద్ధి చెందిన అక్కమహాదేవి ఈ గుహలలో కొంతకాలం తపస్సు చేసిన కారణంగా వీటికి అక్కమహాదేవి గుహలు అనే పేరు ఏర్పడింది.

ఈ గుహల సహజ అందాలను కన్నులారా చూడవలసిందే కాని వివరించి చెప్పలేము. కుడి, ఎడమలలో రెండు ప్రవేశ ద్వారాలు గల ఈ గుహల ముందు భాగంలో స్తంభాకారంలో ఏర్పడిన శిలలను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఎంతో కళా సౌందర్యంతో అలరారే ఈ సహజ స్తంభాలు చెయ్యి తిరిగిన శిల్పి చెక్కిన కళారూపాల్లాగా భాసిస్తాయి.

ఈ గుహల కుడివైపు ప్రవేశద్వారం నుండి లోపలికి వెళితే గుహచివరను చేరవచ్చు. సహజసిద్ధంగా ఏర్పడి, సొరంగం బాగా వుండే ఈ దారి సుమారు 250 మీటర్ల పొడవుండి వంపులుగా వుంటుంది. గుహ అంచులో వేదిక లాగా వుండి, దానిపై శివలింగాకారంలో ఏర్పడిన ఒక శిల వుంది. దీన్ని సహజ శివలింగంగా పేర్కొంటారు. ఇక గుహ ఎడమభాగం కూడా కుడివైపు మాదిరిగానే సన్నగా, వంపులుగా వుండి సుమారు, 150 మీటర్ల పొడవుంటుంది. కాగా గుహల లోపలి భాగంలో వివిధ శిలాకృతులు ఎంతో విచిత్రంగా కనిపిస్తాయి.

సహజశిలాతోరణం

అక్కమహాదేవి గుహలవద్ద భూమికి సుమారు రెండువందల అడుగుల ఎత్తులో ఏర్పడిన సహజ శిలాతోరణం ఎంతో అద్భుతం. సుమారు 200 అడుగుల పొడవు, 16 అడుగుల వెడల్పు 4 అడుగుల మందంతో దీర్ఘ చతురస్రాకారంలో గల ఈ శిలాతోరణం, కింద ఎలాంటి ఆధారం లేకుండా కాంటిలివర్ బీమ్ వుంది. మన దేశంలోని పెద్ద శిలాతోరణాలలో దీన్ని ఒకటిగా చెప్పవచ్చు. అయితే దీని ఉనికి చాలా మందికి తెలియని కారణంగా యిది ప్రాచుర్యంలోకి రాలేదు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పాతాళగంగ మెట్ల నుండి అక్క మహాదేవి గుహల వరకు బోటు సదుపాయాన్ని కల్పించింది. ఎంతో ప్రత్యేకంగా కన్పించే అక్క మహాదేవి గుహలు, అరుదైన అక్కడి శిలాతోరణం, దేశ, విదేశీ పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తికాదు.

కదళీవనం

అక్క మహాదేవి గుహలకు యించుమించు ఎదురుగా రెండవ ఒడ్డున వున్న కదళీవన రేవు నుండి కొండలనెక్కుతూ సుమారు 11 కి.మీ. ప్రయాణించి కదళీవనాన్ని చేరుకోవచ్చు. కదళీవనంలో సహజసిద్ధంగా ఏర్పడిన శిలామండపం చూపరులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తుతుంది. కొండ నుండి సహజసిద్ధంగా ముందుకు వచ్చిన ఒక పెద్ద శిల, కింద ఎలాంటి ఆధారం లేకుండా పైకప్పులాగా వుండి మండపం లాగా ఏర్పడింది. దాదాపు 100 మీ. పొడవు 25 మీ. వెడల్పు వున్న ఈ సహజ మండపం సుమారు వేయి మంది ఒకసారి కూర్చొనేందుకు వీలుగా వుంది. ఈ శిలామండపం అంతర్భాగమంతా గుహను పోలి వుంటుంది. మండపం పైకప్పు నుండి అక్కడక్కడ సన్నటి నీటిబొట్లు రాలిపడుతుంటాయి. మండుటెండల్లో కూడా ఈ శిలా మండపం కింద చెప్పలేనంత చల్లగా వుంటుంది. ఈ శిలామండపం పక్కనే నిరంతరం ఉబికివచ్చే నీటి ఊట చూపరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ కదళీవనం పర్యాటకులకు గొప్ప అనుభూతిని కలిగించడమే కాకుండా, వారు మరో ప్రపంచంలో వున్న భావనను కలిగింపచేస్తుంది.



వైల్డ్ లైఫ్ టూరిజం

'నాగార్జునసాగర్-శ్రీశైలం' ప్రాజెక్ట్ టైగర్‌గా గుర్తించబడ్డ అభయారణ్యంలో శ్రీశైలం అటవీప్రాంతం వుండటం చేత వైల్డ్‌లైఫ్ టూరిజానికి యిక్కడ మంచి అవకాశాలున్నాయి. ఈ పులుల అభయారణ్యం సుమారు 3,568 చ.కి.మీ. విస్తీర్ణంలో గుంటూరు, ప్రకాశం, కర్నూలు, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో విస్తరించివుంది. కృష్ణానదికి అటూ యిటూ వున్న ఈ వన్యప్రాణి సంరక్షణాలయంలో పులి, చిరుతపులి, ఎలుగుబంటి, పెద్దనక్క, చిన్ననక్క, కణితి, చుక్కలదుప్పి, నాలుగు కొమ్ముల దుప్పి, చిన్న దుప్పి, బొర్ర జింకలు ముంగిస, 150 రకాలకు పైగా కీటకాలు, పలురకాల పక్షులు వున్నాయి.

★



ప్రశంసలు! ప్రశ్నలు!!

- పీ పీ

'నోబుల్' అంటే 'గౌరవ ప్రదమైన' అని అర్థం. ఆల్ఫ్రెడ్ నోబుల్ నిధులతో స్వీడన్, నార్వేలో ఏర్పాటు చేసిన నోబుల్ బహుమతులకు కూడా అంతర్జాతీయంగా అలాంటి గౌరవమే వుందని చెబుతుంటారు. ప్రపంచ స్థాయి గుర్తింపునకు ప్రతీకగా నోబుల్ బహుమతిని ప్రస్తావించడం ప్రతివారూ చేసేదే. అయితే ఇంతటి ప్రశంసా భావానికి నోచుకున్న ఆ ప్రపంచ పురస్కారంలో ప్రశ్నార్థకాలు కూడా ఎక్కువగానే వున్నాయి. మరీ ముఖ్యంగా ప్రపంచ దేశాల మధ్య శాంతి సౌహార్థ్రతలు వ్యాప్తి పేరుతో ఇచ్చే నోబుల్ శాంతి బహుమానం అనేది అశాంతికి మారు పేరుగా మారడం అలాంటి వైపరీత్యాల్లో అగ్రస్థానం అలంకరిస్తుంది. శాంతి సామరస్యాల కన్నా అశాంతికి, అభ్యంతరాలకు ఇదే ఎక్కువగా కారణమవుతుంటుంది. ఈ ఏడాది కూడా చైనా అసమ్మతి వాది. ఆ దేశ శాసనాల ప్రకారం నేరస్తుడు అయిన లియూ జియావోబోకు ఈ పురస్కారం కట్టబెట్టడం అలాంటి అభ్యంతరాలకే దారి తీసింది. శాస్త్ర సాంకేతిక సాహిత్య రంగాలలో అవార్డుల ప్రకటన కూడా అంతగా ఆసక్తి రేకెత్తించలేకపోయినా అంత వివాదానికి దారి తీయలేదు. ఎందుకంటే నోబుల్ సాహిత్య రాజకీయ ఆర్థిక బహుమానాలలో ఎక్కువగా రాజకీయ క్రీనీడలు తొంగి చూస్తుంటాయి. ఇప్పటి వరకూ నోబుల్ శాంతి బహుమతి 108 సార్లు ప్రదానం చేయబడితే ఇందులో 98 మంది వ్యక్తులు, 20 సంస్థలు. ఇందులోనూ నాలుగు సంస్థలకు పలు సార్లు అవార్డులు రావడం వల్ల మొత్తం మీద గ్రహీతల సంఖ్య తగ్గుతుంది. ఈ జాబితాను తిరగేస్తే స్పష్టంగా కనిపించేదేమంటే వ్యవస్థలను ప్రశ్నించని వారిని, మూల కారణాలను వదిలేసి విన్యాసాలు చేసే వారిని అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెత్తినెత్తుకుని ప్రగతిశీల సామ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పనిచేసే వారిని ఏరికోరి ఈ అవార్డులకు ఎంపిక చేస్తుంటారు.

ఈ ఏడాది చైనా అసమ్మతి వాది లియూకు అవార్డు విషయమే తీసుకుందాం. గతంలో చైనా వ్యతిరేక మత గురువు దలైలామాకు ఇప్పుడు లియూకు మాత్రమే నోబుల్ పురస్కారం దక్కింది. లియూ ప్రతికూల పరిస్థితులలో మానవ హక్కుల పరిరక్షణకోసం కృషి చేస్తున్నారని నోబుల్ కమిటీ ప్రశంసించింది. అయితే ఈ ఎంపిక నోబుల్ బహుమతి ఆశయాలకే విరుద్ధమైనదంటూ నార్వే న్యాయనిపుణుడు రచయిత ఫ్రెయిడ్ ఎస్. హెఫ్ మ్యాన్ కోర్టులో కేసు వేశారు. లియూ దేశాల మధ్య శాంతి కోసం చేసిందేమిటని ఆయన సవాలు చేశాడు. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా గత ఏడాది ఈ బహుమానం విజేత! అధ్యక్ష పీఠం అధిష్టించిన అతి కొద్ది కాలంలోనే అది కూడా ఆధిపత్య అమెరికాకు అధినేతకు శాంతి బహుమానం ఎలా ఇచ్చారని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ సంగతి అలా వుంచి ఒబామా లియూకు బహుమతి ప్రకటించడాన్ని హర్షిస్తూ

వామపక్షం నుంచి మితవాదం వైపు మొగ్గిన రచయిత



నోబుల్ శాంతి బహుమానమే గాక సాహిత్య పురస్కారం కూడా ఈ సారి వామపక్ష రాజకీయాలను వదలిపెట్టిన రచయితకు దక్కడం విశేషం. గతంలో అనేకసార్లు సాహిత్య బహుమానం మాత్రం వామపక్ష రచయితలకు లభించడం జరుగుతున్నది. ఈ ఏడాది నోబుల్ సాహిత్య పురస్కారం పొందిన పెరూ స్పానిష్ రచయిత మారియో వర్గాస్ లోసా నిస్సందేహంగా ప్రపంచ ప్రసిద్ధ రచయిత. లాటిన్ అమెరికాలో అత్యంత ప్రముఖుల శ్రేణికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం 74 వ ఏట వున్న లోసా నిర్విరామంగా నిశితంగా రచనలు చేసి ప్రపంచ పాఠకులను అబ్బుర పర్చాడు. విమర్శకులనూ ఆకట్టుకున్నాడు. 1963లో 'ద టైమ్ ఆఫ్ ఎ హీరో' నవల ఆయన తొలి సంచలనం. సైనిక పాఠశాలలో తన అనుభవాలను అక్షరీకరించిన ఆ పుస్తకాన్ని అధికారులు బహిరంగంగా తగలబెట్టారు. 1950లలో 'మాన్యుల్ ఎ ఒడ్రిడా' సైనిక నియంతృత్వంలో మగ్గిన పెరూ రాజకీయాలను ప్రజాస్వామ్య దిశలోకి మళ్లించడంపై ఆయన రాసిన నవల 'కన్వర్షేషన్స్ ఇన్ ద క్యాథడ్రిల్' (1969) అందరినీ కుదిపేసింది. ఆయన నవలలో కేవలం కథలు, కల్పనలే గాక చారిత్రిక వ్యాఖ్యానం కూడా ప్రధాన స్థానమాక్రమిస్తుంటుంది. ఒక విధంగా పెరూతో సహా లాటిన్ అమెరికా దేశాల పరిస్థితులను ప్రపంచానికి చాటిచెప్పిన రచయితల్లో ఆయన అగ్రగణ్యుడు.అక్షరాల ద్వారా ప్రపంచాన్ని మార్చాలన్నది ఆయన ప్రధాన లక్ష్యంగా చెప్పుకుంటాడు.

'ద ఫీస్ట్ ఆఫ్ ద గోట్' (2000) అన్న నవల కూడా బాగా ప్రభావం చూపింది. 1930-61 మధ్య డొమినికన్ రిపబ్లిక్‌లో ట్రోజిల్లో పాలనా కాలాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. 'ఆంట్ జూలియా అండ్ ద స్క్రిప్ట్ రైటర్ (1977), ద వార్ ఆఫ్ ద ఎండ్ ఆఫ్ ద వరల్డ్ (1981), డెత్ ఇన్ ద ఆండేస్ (1993)' ప్రసిద్ధమైన ఆయన ఇతర రచనలు. పాత సమాజంలోనూ ఆధునిక వ్యవస్థలోనూ వివిధ రూపాలలో సాగుతున్న క్రౌర్యాన్ని ఈ నవలలో ఆయన చిత్రీకరించాడని విమర్శకులు ప్రశంసించారు.

పెరూలో పుట్టిన లోసా తలిదండ్రుల విడాకుల కారణంగా బొలీవియాలో కొంతకాలం పెరిగాడు.1946లో పెరూ తిరిగివచ్చి మిలటరీ అకాడమీలో చదువుకున్నాడు. ఆ నేపథ్యమే ఆయన హీరో నవలకు ప్రేరణ అయింది. భాషాధ్యయనంలోనూ పత్రికారంగంలోనూ కూడా ఆయన కృషి చేశారు. జెకోస్లవేకియాలో సోషలిజంపై తొలి దెబ్బ తీసిన రచయిత హావెల్‌తో ఆయనను పోల్చుతుంటారు. మొదట్లో వామపక్ష వాదిగా వున్న లోసా తర్వాత కాలంలో మధ్యేవాదిగా ఆఖరులకు పచ్చి మితవాదిగా మారాడు. ఒకసారి పెరూ అధ్యక్ష స్థానానికి కూడా పోటీ పడి ఓడిపోయాడు. అంతర్జాతీయ పౌరుడనే పేరిట ఆయన పెరూను వదిలి వెళ్లాడు. ఇప్పుడు లోసా మార్కెట్ ఆర్థిక వ్యవస్థను గట్టిగా బలపరుస్తుండడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. ఈ పురస్కారం దక్కడానికి అది కూడా ఒక కారణమై వుండొచ్చు.

ఆయనను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఉచిత సలహా పారేశారు. చైనా ఆర్థికంగా గొప్ప అభివృద్ధి సాధించిందని, ఇదే మానవ హక్కుల అమలులోనూ చూపించాలని ఆయన హితబోధ చేశారట. ఇతర విషయాలలా వుంచి ఇక్కడ ఒక ప్రశ్న వేయొచ్చు. వంద కోట్ల జనాభా గల చైనా ప్రపంచంలో ప్రముఖ శక్తిగా ఎదగడానికి మూలకారకుడైన మావోసెటుంగ్‌కు ఎందుకు నోబుల్ ఇవ్వలేదు? పోనీ ఈ ఆధునీకరణకు, అభివృద్ధికి మూల పురుషుడైన డెంగ్ సియావో పింగ్‌కు ఎందుకు ఇవ్వలేదు? కారణం చెప్పడం చాలా సులభం- వారు కమ్యూనిస్టు విప్లవ నేతలు. లూయీ వారు తెచ్చిన విప్లవ చైనాను కూలదోయాలని చూస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేకి. గతంలో చైనా వ్యతిరేక కార్యకలాపాల కోసం దేశం వదలి వచ్చి మన దేశంలో తిష్ట వేసిన దలైలామాకు అవార్డు ఇవ్వడానికి కూడా ఇదే కారణం. కనక నోబుల్ శాంతి బహుమతికి మొదటి అర్హత కమ్యూనిస్టు వ్యతిరేకత. ఇప్పుడు ఉనికిలో లేని సోవియట్ యూనియన్ ఆఖరి అధ్యక్షుడు విచ్ఛిన్నకుడైన మిహాయిల్ గోర్బచెవ్‌కు మాత్రం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో వుండగానే నోబుల్ దక్కింది. ఎందుకంటే ఆయన తమ కుట్రలు జయప్రదం కావడానికి రాజమార్గం వేస్తున్నాడని బాగా తెలుసు! ఇదే రీతిలో పోలండ్‌లో సోషలిజం కూల్చివేయడానికి తద్వారా ప్రపంచ సోషలిస్టు శిబిరంలో చిచ్చుపెట్టడానికి ఆద్యుడైన లెచ్ వలేసాకు నోబుల్ అందించారు. అమెరికా అధ్యక్షులు నలుగురికి, ఉపాధ్యక్షుడు అల్‌గోరేకు నోబుల్ పురస్కారాలు లభించడం యాదృచ్ఛికమేమీ కాదు.

విదేశాంగ మంత్రిగా ప్రపంచంతో ఆడుకున్న హెన్రీ కిసింజర్‌కు కూడా ఆయనపై పోరాడిన వీర వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి లిడక్‌తో కలసి శాంతి బహుమానం ప్రకటించడంలో కాపట్యం మాటలకందేది కాదు. ఇదే రీతిలో పాలస్తీనా విముక్తి నేత అరాఫత్‌కు వారిపై నిరంతర మారణకాండ సాగించే ఇజ్రాయిల్ యూదు జాత్యహంకార పాలకుడు రబిన్‌కు కలిపి అవార్డు ఇచ్చారు. ఇవన్నీ శాంతి పేరిట నోబుల్ పెద్దలు సాగించిన కపట నాటకాలకు తార్కాణాలు. ఇంతకూ లీడక్‌తో నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తే గోర్బచెవ్ గంతులేసుకుంటూ వెళ్లి పురస్కారం తీసుకున్నాడు. ఇది వారి వారి రాజకీయ స్వభావాలను వెల్లడించే విషయం.

ఈసారి బాగా వివాదాస్పదమైన లూయి జియావోబో సంగతి తీసుకుంటే ఆయన చైనాలో మానవ హక్కుల కోసం కృషి చేశాడని నోబుల్ కమిటీ కీర్తించింది. 'చైనా 08' పేరిట గొప్ప మానవ హక్కుల దృక్పథం ఆయన కనిపెట్టాడట. 1989లో తియాన్ మెన్ స్క్వేర్ ఘటనల కాలం నుంచి నికరంగా నిలబడుతున్నాడట. వృత్తిరీత్యా ప్రొఫెసర్ కనక ఆయన గొప్ప నిస్వార్థ మేధావి అయినట్టు చిత్రించబడుతున్నది. వేగంగా పరుగులెత్తే కాలంలో గతం గుర్తు వుండదని అమెరికా కూటమి ఆలోచన కావచ్చు. సోవియట్ అధినేతగా గోర్బచెవ్ దాదాపు రెండున్నర దశాబ్దాల అనంతరం చైనాలో పర్యటనకు వెళుతున్న సమయంలో విద్యార్థుల నిరసన పేరిట తియాన్‌మెన్ స్క్వేర్ ప్రహసనం సాగింది.అప్పటికే తూర్పు యూరప్ దేశాలలో సోషలిజం విచ్ఛిన్నమవుతున్న నేపథ్యంలోనూ చైనాలోనూ అలాంటి ప్రతికూల పరిణామాలు తీసుకురావచ్చని కమ్యూనిస్టు వ్యతిరేకులు తలపోశారు. నాటి చైనా ప్రధాని జియావో బాంగ్ కూడా వూగిసలాట కనపర్చారు.అయితే డెంగ్ నాయకత్వంలో చైనా ప్రభుత్వం

దారి తప్పిన చైనా ప్రొఫెసర్

నోబుల్ శాంతి బహుమాన గ్రహీత ప్రొఫెసర్ లూయి వెనోబో గురించి అంతర్జాతీయంగా విపరీత ప్రచారం లభించడానికి కారణం ఆయనకు సామ్రాజ్యవాద శిబిరంతో వున్న సంబంధాలే. చైనాలో ఆయన గురించి పెద్దగా తెలియదు. సమాచారాన్ని తొక్కి పట్టడమే అందుకు కారణమనొచ్చు గాని వాస్తవంలో చైనా ప్రజల జీవిత సమస్యలతో ప్రగతితో ఆయనకు పెద్దగా సంబంధం లేదు. కొద్ది మంది మేధావులు ఉన్నత తరగతి జీవుల స్వేచ్ఛా వాణికి ప్రతినిధిగానే ఆయన ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చాడు. తినాన్ మేన్ స్క్వేర్ ఘటనలు తన జీవితాన్ని మలుపు తిప్పాయని ఆయన అంటారు. మానవ హక్కులు లేవన్న పేరిట ఆయన సాగించిన దేశ వ్యతిరేక కార్యకలాపాలే ఆయనపై విచారణకు జైలు శిక్షకు దారి తీశాయి. వాస్తవంలో ఆ తర్వాతి కాలంలోనే చైనా మహత్తర ఆర్థిక శక్తిగా ఎదిగిన సంగతి జగమెరిగిన సత్యం. తనపై జరిగిన ఒక విచారణలో లూయి ఈ సంగతి అంగీకరించాడు కూడా. చైనా రాజకీయ జీవితంలోనూ న్యాయ వ్యవస్థలోనూ మార్పులు సాధించడంలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప పాత్ర నిర్వహించిందని అతనన్నాడు. జైలులో తనను చాలా మానవతా దృష్టితో చూశారని కూడా ప్రకటించాడు. 1999 తర్వాత చాలాసార్లు విడుదల కావడం సంస్కరణ తరగతులకు హాజరవడం జరిగినా ఆయన మౌలిక వైఖరిలో మార్పు రాలేదు. అందుకే '08 చైనా' పేరుతో ఒక పత్రం సృష్టించి విదేశాలకు చేరవేశాడు. నిజంగా చైనా వీరంతా చెబుతున్నంత క్రూర ప్రభుత్వమే అయితే ఇవన్నీ సాధ్యమై వుండేవి కావు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే ఇండియాలో ఎన్ని బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నదీ చూస్తూనే వున్నాం. దేశాలకు దేశాలను మారణహోమానికి బలిచేస్తున్న అమెరికా సంగతీ చూస్తున్నాం. కాని లూయిని అధికారికంగా విచారించి ఆ వివరాలను వెల్లడి చేయడం కాదనలేని విషయం. చైనా నోబుల్ బహుమతి వార్తను తొక్కిపట్టిందన్న కథనాలతో పాటు ఆయన భార్య వెళ్లి చూసిందన్న సమాచారం కూడా ఆగలేదు.అందువల్ల చైనాలో మానవ హక్కులను గురించిన విపరీతమైన గగ్గోలు పెంచడానికి ఇది ఒక వ్యూహాత్మక అడుగు. దీని ప్రభావాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటేనే ప్రపంచ రాజకీయాలు అర్థమవుతాయి.కాశ్మీర్ తీవ్రవాదులకు బిల్ క్లింటన్ మానవ హక్కుల యోధులని కితాబులు కురిపించినప్పుడు మనం అంగీకరించలేదని కూడా గుర్తుంచుకోవాలి.

ఆర్థిక రంగంలోనూ అరకొర సిద్ధాంతాలకే పట్టం

మిగిలిన సామాజిక రంగాల వలెనే ఆర్థిక రంగంలోనూ నోబుల్ పురస్కారం అరకొర సిద్ధాంతాలకే లభించడం యాదృచ్ఛికం కాదు. ఇప్పుడు ప్రపంచాన్ని ప్రత్యేకించి అమెరికాను కలవరపరుస్తున్న నిరుద్యోగ సమస్యపై ఒక నిరర్థక పరిశోధన నిర్వహించిన అమెరికా బ్రిటన్ ఆర్థిక వేత్తలు పీటర్ డైమండ్, డేల్ మోర్టిన్ సన్, క్రిస్టపర్ పిసారెడ్స్ అనే ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబుల్ ఇచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణమైన నిరుద్యోగం ఈ అసమానతల ప్రపంచీకరణ నేపథ్యంలో మరింత తీవ్రమవుతున్నది. దీన్ని చెప్పకుండా అవసరమైన ఉద్యోగాలు దొరక్క నిరుద్యోగులు అవసరమైన ఉద్యోగులు దొరక్క సంస్థలు ఇబ్బంది పడుతుంటారన్న వాదనను వీరు తీసుకొచ్చారు. వాస్తవానికి ఇది 1960,70ల నుంచి సాగుతున్న పరిశోధనే. నిరుద్యోగాన్ని పట్టించుకున్నట్టు కనిపించడానికి వీరిని ఎంచుకున్నట్టు కనిపిస్తుంది తప్ప దీనివల్ల వ్యవస్థాగతమైన సమస్యలకు పరిష్కారం లభించేదేమీ వుండదు. పైగా ఈ ఆర్తిక శాస్త్ర వేత్తలు నిరుద్యోగ భృతి మంచిది కాదని కూడా వాదించడం గమనార్హం.



చెక్కు చెదరకుండా నిలిచి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ఆ సమయంలో నెత్తురు టేరులు పారాయని సామ్రాజ్యవాద మీడియా కోడై కూసింది. కాని అది నిజం కాదని తర్వాత అదే మీడియా అంగీకరించాల్సి వచ్చింది. వందలమంది మరణించారని విద్యార్థుల మీద ట్యాంకులు నడిపించారని వినిపించిన కథలు నిరాధారాలని తేలింది. మన దేశంలోనూ రాష్ట్రంలోనూ వున్న బడా పత్రికలు కూడా ఆ మేరకు దిద్దుబాటు సమాచారం ప్రచురించాయి.ఇంతా అయిన తర్వాత ఇన్నేళ్లకు లియూను నాటి నుంచి వున్న యోధుడని కీర్తిస్తూ నోబుల్ కట్టపెట్టడం ఎంత లోతైన వ్యూహమో ఇట్టే అర్థమవుతుంది. సోవియట్ యూనియన్‌లోనూ సోషలిజానికి వ్యతిరేకంగా పనిచేయడానికి విశ్వ విద్యాలయాలలో బుద్ధి జీవులను ప్రధాన పావులుగా చేసుకున్న అనుభవం సామ్రాజ్యవాదానికి వుంది. స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్ హయాం నుంచి కొనసాగిన ఈ రహస్య అసమ్మతి గోర్బచెవ్ కాలానికి బహిరంగంగానే ముప్పు తెచ్చిపెట్టింది. సోవియట్‌తో పోలిస్తే చైనా ముందుగానే మేల్కొని ఆధునీకరణ మార్గం చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించింది. ఇప్పుడు పాదార్థికంగా దాని ప్రగతిని ప్రపంచమంతా గుర్తిస్తున్నది.ఇలాటి పరిస్థితుల్లో అక్కడి ప్రజలలో అసంతృప్తి కలిగించడం అంత తేలిక కాదు గనక మానవ హక్కుల మంత్రం అవసరమైంది. లియూను దానికి యోధుడుగా చెబుతూ ఆ ముసుగులో ముసలం పుట్టించాలన్నది ఇక్కడ పథకం.

కాకపోతే గత ఇరవయ్యేళ్లలోనూ ప్రపంచం చాలా మారింది. నాడు గోర్బచెవ్ తనే భ్రమలకు గురై వ్యాపింప చేశాడు. కాని సామ్రాజ్యవాద కుట్రలను గురించి ఇప్పుడు ఎవరైనా గుర్తించక తప్పడం లేదు. ఈ బహుమానం ప్రకటించిన తర్వాత మొదటి సారిగా చైనా ఇటీవలి కాలంలో ఎన్నడూ

లేనంత గట్టిగా అమెరికాను విమర్శించింది. సోవియట్‌లో లాగే తమ దేశంలోనూ సోషలిజాన్ని కూల్చడానికే ఈ అవార్డు ఇచ్చారని నిశితంగా ధ్వజమెత్తింది. దాంతో పాటు అనేక అరబ్ దేశాలు కూడా అమెరికాను విమర్శించాయి. వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావేజ్ మరింత సూటిగా ఖండించాడు. ఇదంతా మారిన ప్రపంచ స్థితిని ప్రతిబింబిస్తుంది. కాని మన తెలుగు పత్రికలతో సహా ప్రగతి ముద్రాంకితులైన అనేకులు ఈ వాస్తవాలను చూడలేక పోతున్నారు. చైనాలో మానవ హక్కులు కాలరాచివేయబడుతున్నట్టు వాటికోసం అమెరికా అండతో పోరాడాలన్నట్టు-చిత్రిస్తున్నారు. దేశ దేశాలపై దండెత్తి అంతర్జాతీయ శాంతికి ప్రధాన ప్రమాదంగా వున్న అమెరికా శాంతి మానవ హక్కుల వంటి మంత్ర జపం చేయడం మానవత్వాన్ని అవమానించడమేనని విజ్ఞులైన ఈ సంపాదకులు గ్రహించలేక పోవడం శోచనీయం. ఏ వర్ధమాన దేశంలో కన్నా చైనాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా వున్నాయి. అమెరికా తర్వాత రెండవ పెద్ద ఆర్థిక శక్తిగా అది జపాన్ స్థానాన్ని ఆక్రమించడానికి సిద్ధంగా వుంది. ఈ కారణంతోనే దాని ప్రతిష్టను ప్రగతిని దెబ్బ తీయడానికి నోబుల్ అస్త్రాన్ని ప్రయోగించబోయి భంగపడింది అమెరికా. కొంతమంది ఈ పురస్కారాన్ని మయన్మార్‌లో ఆంగ్‌సుకికి ఇచ్చిన బహుమానంతో పోల్చడం అర్థరహితం. సైనిక నియంతృత్వంలో మగ్గిపోతున్న మయన్మార్‌కు 120 కోట్ల మంది ప్రజల సంక్షేమమే ప్రధానంగా దూసుకుపోతున్న చైనాకు పోలికే లేదు. లోపాలు, తప్పిదాలు ఏమైనా వాటిని సరిచేయడానికి గాక సోషలిజాన్ని విచ్ఛిన్నం చేయడానికి తన మేధను తాకట్టు పెట్టిన లియూను సత్కరించడంలో దుర్బుద్ధి ఏమిటో దాచేస్తే దాగని సత్యంలా క నిపిస్తూనే వుంది. ఇంతకూ లియూ అమెరికా నుంచి ఏటా 40 లక్షల చైనా కరెన్సీ పుచ్చుకుంటున్నాడని వెబ్‌సైట్లు చెబుతున్నాయి. రాజకీయ కార్యకలాపాల కోసం ఇతర దేశాల నుంచి విరాళాలు పుచ్చుకోవడం అమెరికాలో పెద్ద నేరం. కాని ఇతర దేశాలకు నిధులు తరలించి ఏజంట్లను ఏర్పాటు చేసుకోవడం అమెరికా హక్కు. అలాటి ఏజంట్లు ఒక దశలో అంతర్జాతీయ యోధులై పోతారు. పోలండ్‌లో సాలిడారిటీ పేరుతో సోషలిస్టు శిబిరంలో చిచ్చుపెట్టిన లెచ్‌వాలేసాను అమెరికా అధ్యక్షుడు రీగన్ పోప్ జాన్‌పాల్ సమక్షంలోనే కలుసుకున్నట్టు తర్వాత కాలంలో వెల్లడైంది. ఈ అనుభవాలన్నీ మర్చిపోయి నోబుల్ నాటకాలకు వంత పాడితే వర్ధమాన దేశాలు శాంతి కాముక శక్తులకు చేటు తప్పదు.

★

పున:సృష్టికి పురస్కారం

ఈ ఏడాది జీవ శాస్త్రంలో నోబుల్ బహుమతి ప్రపంచాన్ని అబ్బుర పర్చిన టెస్ట్‌ట్యూబ్ బేబీ సృష్టికర్త రాబర్ట్ ఎడ్వర్డ్ కు ఇచ్చారు. ఇది అందరూ హర్షించిన నిర్ణయం. వాస్తవంలో ఇది బాగా ఆలస్యమైందని భావించే వారు కూడా వున్నారు. ఇప్పుడు 85 ఏళ్ల వయస్సులో వున్న రాబర్ట్ కృషి ఫలితంగానే 1978 జులై 25న తొలి టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రభవించింది. దీన్ని శాస్త్రీయ భాషలో కృత్రిమ గర్భధారణ ప్రక్రియ అంటారు. అండాన్ని పురుష బీజకణాన్ని గర్భాశయానికి వెలుపల ప్రయోగ శాలలో ఫలదీకరణం చేయడమే ఈ పద్ధతిలో మూలసూత్రం. ఈ పద్ధతిలో ఇప్పటికి నలభై లక్షల మంది శిశువులు పుట్టినట్టు ఒక అంచనా. 1950లోనే దీనిపై కృషి ప్రారంభించిన ఎడ్వర్డ్ తర్వాతి కాలంలో గైనకాలజిస్ట్ ప్యాట్రిక్ స్టెప్ సాయంతో ఇందుకోసం ఒక ప్రత్యేక వైద్యశాలనే స్థాపించాడు. వెయ్యి మంది పిల్లలు ఈ పద్ధతిలో పుట్టారని తెలుసుకున్న తర్వాతనే స్టెపీ మరణించడం ఒక విషయమైతే ఈ నోబుల్ బహుమతిపై స్పందించడానికి ఎడ్వర్డ్ ఆరోగ్యం సహకరించకపోవడం మరొక విషయం. మొత్తంపైన ప్రపంచంలో పదిశాతం మంది దంపతులు సంతాన లేమితో బాధపడుతున్నట్టు అంచనా. ఇదే సమయంలో భారత దేశంలోనూ ఇంచుమించు అదే సమయంలో (మూడు నెలల తర్వాత) సుభాష్ ముఖోపాధ్యాయ అనే కోల్‌కతా వైద్యుడు టెస్ట్‌ట్యూబ్ బేబీని సృష్టించినా గుర్తింపు రాలేదని అంటున్నారు. షరామామూలుగా ఇందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు కొందరు. సుభాష్ 1981లో ఆత్మహత్య చేసుకున్నాడు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నిరంకుశ పద్ధతుల కారణంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆత్మహత్యలు చేసుకున్నారన్నది తెలిసిందే.

కృత్రిమ రసాయనాలకు నోబెల్

కేన్సర్ వ్యాధిని అరికట్టడంలో కీలక పాత్ర పోషించే రసాయనాన్ని కృత్రిమంగా తయారు చేసేందుకు మార్గం కనిపెట్టిన ఇఛీనెగిషీ, అకిరా సుజుకీ, రిచర్డ్ హెక్ లకు నోబుల్ పురస్కారం దక్కింది. ఈ ముగ్గురిలో మొదటి ఇద్దరు జపనీయులు కాగా హెక్ అమెరికన్. ఒక సముద్ర జీవిలో శత్రువులను ఎదుర్కోవడానికి గాను తయారయ్యే ఈ రసాయనాన్ని కేన్సర్‌కే గాక అనేక మొండి వ్యాధుల చికిత్సకు ఉపయోగించనున్నారు. దీన్ని పల్లాడియం కేటలైజ్డ్ క్రాస్ కప్లింగ్ అంటారు. ఇప్పటికే ఇది విస్తృతంగా వాడకంలోకి వచ్చేసింది. ఇది కంప్యూటర్ తెరలకు కూడా ఉపయోగపడుతుంది. మిణుగురు పురుగుల్లో కాంతిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని పట్టుకోగలగడమే ఇందుకు కారణం. ఇదే ఔషధోత్పత్తికి దోహదం చేస్తుంది.

భౌతిక శాస్త్రంలో....

భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది నోబుల్ బహుమానం ఆసక్తికరమైంది. పిల్లలు ఉపయోగించే పెన్సిల్ నమూనాను పరిశోధించడం దీనికి మూలం. ఇందులోని గ్రాఫైట్ నుంచి అనూహ్యమైన ప్రభావం చూపగల పదార్థాలను వెలికి తీసిన పరిశోధకులు ఇంగ్లండ్‌కు చెందిన ఆండ్రీ గ్రిమ్, కాన్‌స్టంటిన్ నావోసెలోవ్‌లకు నోబుల్ దక్కింది. 1907లో అణు పితామహుడు ఎర్నెస్ట్ రూథర్ ఫర్డ్‌తో మొదలు పెట్టి ఇప్పటికి 23 మంది నోబుల్ గ్రహీతలు ఈ నమూనానే ఉపయోగించడం గమనార్హం.



కథ

ఋణం

-శాంతిశ్రీ

'ఇదిగో మాటలు మంచిగా రానీయ్.. మాటన్నాక మాటే.. మరి పరువు తీయమాక?' అంది దుర్గ. 'డబ్బులు తీసుకున్నప్పుడు గుర్తుకు రాలేదా పరువు? తీసుకున్నప్పుడు ఇవ్వడానికేంటి దొబ్బిడాయ్..' చాలా విసురుగా అంది సుబ్బాయమ్మ. 'ఇస్తామంటున్నాంగా... మరీ అంత పెద్దగా అరవమాకు పెద్దమ్మా' ఆ పక్కా ఈ పక్కా ఎవరైనా వింటున్నారేమో అనీ అటూ ఇటూ కంగారుగా చూస్తోంది దుర్గ. 'హరిశ్చంద్రుడంతటోడే ఆలిని అమ్మి అప్పు కట్టాడు. అట్టాంటి దేశంలో పుట్టినోళ్లం మనం. అప్పు తీసుకున్నాక కట్టక తప్పుద్దా! ఇస్తేగానీ ఇక్కడ నుంచి కదలేది లేదు..' అంది సుబ్బాయమ్మ. 'చెప్పేది నీక్కాదూ.. మా ఆయనొచ్చాడంటే పెద్ద గొడవైద్ది.. అయినా ఆ అమ్మాయి ఇవ్వకపోతే నా గొంతు పట్టుకుంటావేంటి? 'ఆ గ్రూపుకు లీడరును నేను.. ఎవరు కట్టకపోయినా అందరిదీ బాధ్యత. ఈ విషయం ముందే చెప్పాగా.. ఆళ్లందరికీ నువ్వు బాధ్యురాలివని ఆ రోజు ఒప్పుకున్నావు.' మరింత దబాయింపుగా అంది సుబ్బాయమ్మ. 'అవుననుకో.. నసిగింది దుర్గ. 'ఈ నసగడాలు నా దగ్గర కుదరవ్.. నీదే బాధ్యత. అందరూ కలిసి కట్టండి. మీ మీద నాకేమన్నా పగా ఏంటి? నేనూ మీలోదాన్నేగా.. డబ్బులు కట్టకపోతే ఆ కంపెనీ వాళ్లు నన్ను బతకనివ్వరు. అందుకే మిమ్మల్ని నేనింత ఒత్తిడి చేసేది' హూరమేసేసింది సుబ్బాయమ్మ. 'అందుకనేగా నిన్నంతగా బతిమాలేది.. మేమందరం మాట్లాడుకుని రేపు చెపుతాం.. ఒక్కరోజు ఆగు. మా ఆయనకి తెలిస్తే... నా ప్రాణం తీసేస్తాడు..' అని బతిమిలాడింది దుర్గ. ఈలోపు సుబ్బాయమ్మ ఫోను మోగింది. 'ఆ సారూ..! ఇప్పుడు ఆడే ఉన్నా. రేపు ఇచ్చేత్తాం' లోగొంతుకలో చెపుతోంది సుబ్బాయమ్మ. అవతల ఏమంటున్నారో.. ఏమో.. 'అట్టాగే సారూ.. అట్టాగే..' అంది మాడిపోయిన మొహంతో. 'ఇదిగో మీకు చెప్తే ఏమీ అర్థంకావడంలా.. రేపుగానీ డబ్బులు కట్టకపోతే ఆ కంపెనీ ఓనరు నా సంగతి చూస్తానంటున్నాడు...' అంటూ కొంగు విదిలించుకుని, బ్యాగ్ తగిలించుకుంటూ వెళ్లిపోయింది సుబ్బాయమ్మ. 'హమ్మయ్య..! తుపాను వెలిసినట్లుంది..! ఈయనకు విషయం తెలిసిందంటే.. ఇంకేం లేదు.. నన్ను చంపేస్తాడు. పరువంతా తీసేశానంటాడు.. అసలిందులో జేరకుండా ఉండాల్సింది..' తనని తనే తిట్టుకుంది దుర్గ.

సుశీల, సుభద్ర, శివమ్మను కలుపుకుని అనిత ఇంటికి వెళ్లింది దుర్గ. 'ఇదిగో అనితా! నిన్న సుబ్బాయమ్మ వచ్చి పెద్ద గోల చేసింది. మీ అన్నకు తెలిస్తే నన్ను బతకనివ్వడు. నువ్వు డబ్బు కట్టలేనప్పుడు ఎందుకు తీసుకున్నట్టు..?' కోపంగా అంది దుర్గ. 'అదేంటి వదినా! మా పరిస్థితి నీకు తెలియదా? నేనూ కట్టేద్దామనే అనుకున్నా. అన్ని ధరలూ పెరిగిపోయాయా? వచ్చిన డబ్బులు వచ్చినట్టు అయిపోయాయి. మొన్న పిల్లకు మొదటి పుట్టినరోజు కదా అని చుట్టాలందరికీ భోజనాలు పెట్టుకున్నా. చేతిలో డబ్బులన్నీ అయిపోయాయి. ఓ పక్క పండగొస్తోంది.. పిల్లలకు బట్టలు కొనాలి.. ఏమైనా తింటానికి వండుకోవాలన్నా చేతిలో చిల్లిగవ్వలేదు..' బాధగా అంది అనిత. 'ఎవరికి లేవమ్మా ఇబ్బందులు.. అంతలేనప్పుడు ఆర్భాటాలకెందుకు పోవడం..? ఒప్పుకున్నాక తలతాకట్టుపెట్టైనా కట్టాలి. నీ మూలంగా మేమంతా ఇరుక్కున్నాం..' కసిరినట్టే అంది సుశీల.

'అదేంటి అక్కా! నువ్వూ అట్టా మాట్లాడతావు. మిమ్మల్ని ఇబ్బంది పెడతం నాకుమాత్రం ఇష్టమా ఏంటి? ఇట్టా మనకొక్కళ్లకే కాదుగా.. ఊళ్లో ఉన్న చాలా గ్రూపుల్లో ఇదే పరిస్థితి. నా పరిస్థితి అర్థంచేసుకోండి.' అంది అనిత. 'అర్థంచేసుకుని ఏం చెయ్యమంటావు? అందరి పరిస్థితీ అంతే? వాళ్ళు చచ్చారనీ.. మనమూ చద్దామా? నువ్వే ఏదో ఒకటి ఆలోచించి... ఎలాగోలా ఆ డబ్బు కట్టాలి. గట్టిగా అడిగింది సుభద్ర. 'అదేంటి వదినా అట్టా అంటావు? మీరంతా చల్లగా ఉండాలి. మరీ అంతలేసి మాటలనకండి.. అందరితో మాటలు పడాల్సి వచ్చింది.. అయినా ఆ కంపెనీ వాళ్లు ముందు రెండు రూపాయల వడ్డీనే పడుద్దని అన్నారు. మనం వారం వారం కట్టే కిస్తీల్ని అసల్లో తగ్గించడం లేదు. మొదట్లో తీసుకున్న అసలుకే చివరివరకూ మొత్తం వడ్డీ వసూలు చేస్తున్నారు. లెక్కేస్తే పది రూపాయలు పడుతుంది. అంత కట్టాలంటే కష్టమవుతోంది..' అంటూ కన్నీరు పెట్టుకుంది అనిత.

'ఏడ్వమాకా..! ఏడ్చి ఏం లాభమమ్మాయి..? ఎక్కువ వడ్డీ అవుద్దని ఎవరికి తట్టింది. ఆళ్లు చెప్పేప్పుడు నువ్వూ ఉన్నావుగా.. ఇప్పుడనుకుని ఏం లాభం? ముందు నువ్వు ఆ డబ్బు ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తావో చెప్పు...? ఆ సుబ్బాయమ్మను కంపెనీవాళ్లు ఊరుకునేట్లు లేరు. మీ బాబాయికి తెలిస్తే నన్ను నాలుగు తగులుకుంటాడు. నీకు తెలియందేముంది చెప్పు?' అంది శివమ్మ. 'అదికాదు చిన్నమ్మా! నేనెంత చెప్పినా మీకెందుకు అర్థంకాదు. ఇప్పుడు నాకాడ పైసా కూడా లేదు చిన్నమ్మా..? 'తలకొట్టుకుంటూ అంది అనిత. 'అట్టా అంటే ఎట్టా అమ్మాయ్.. ఏదైనా అప్పు చేసి ఈ డబ్బులు కట్టేస్తే.. తర్వాత సంగతి తర్వాత... ఏమంటారే అమ్మాయిలూ..' అంటూ వాళ్లవైపు చూసింది శివమ్మ. 'అంతే... నువ్వు చెప్పిందే కరెక్టు...' అంది సుశీల. 'ఇక పదండి..' అంది సుభద్ర.. అందరూ లేచారు.

ఆ రోజంతా వాళ్లవాళ్లందరికీ ఫోనులు చేసి, డబ్బుల కోసం అన్నిరకాల ప్రయత్నాలు చేసింది అనిత. అందరూ 'ఇప్పుడు పండగ కూడా వస్తోంది.. మా దగ్గర లేవంటే.. మా దగ్గర లేవన్నారు..' అనితకు ఏం చేయాలో పాలుపోలేదు.

◆◆◆

'శివ చిన్నమ్మా..! ఓ శివ చిన్నమ్మా..!' అని కేకలు పెట్టుకుంటూ సుశీల, సుభద్ర కంగారుగా వస్తున్నారు. 'ఏంటే ఆ కంగారు ఆగండాగండి..' అంటూ ఎదురొచ్చింది శివమ్మ. 'అనిత ఉరేసుకుంది..' అంటూ శివమ్మను పట్టుకుని ఇద్దరూ పెద్దగా ఏడ్చేశారు. 'మనం వచ్చేశాక రాత్రికి భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారంట. అనిత ఇంట్లోకెళ్లి తలుపులేసుకుని ఉరేసుకుందంట..' ఏడుస్తూనే చెప్పింది సుశీల. ఏం చేయాలో ఎవరికీ పాలుపోలేదు. ఎవరికీ ఏడుపు ఆగడం లేదు. ఒకటే ఆందోళన.

అనిత ఇంటికి దుర్గను కూడా తీసికెళ్దామని వెళ్లేసరికి... దుర్గా వాళ్లాయన సుబ్బారావు గొడవపడుతున్నారు. ఏదో గిన్నెలు పడిన శబ్దం... 'అదికాదు మామయ్యా! నే చెప్పేది వినూ...!' అంటూ బతిమిలాడుతోంది దుర్గ. 'ఏంటే నువ్వు చెపితే నేనినేది. చెప్పింది ఇనబట్టే ఇట్టా అయ్యింది.. ఇందులో ఇన్ని ఇబ్బందులున్నాయని ముందెందుకు చెప్పలేదు? ఇప్పుడు ఆ పిల్ల చచ్చిపోయింది. మొన్న ఆ వెంకాయమ్మ గ్రూపులో నాగమణి చచ్చిపోయిందంట. పోయినవారం ఆ గ్రూపు లీడరు సుభద్రమ్మ పిన్ని చచ్చిపోయింది. ఇట్టా ప్రాణం పోయే పరిస్థితి ఉంటే అసలు ఇందులోకి ఎందుకు దిగారే? అసలు ఆ కంపెనీ వాళ్లు ఏం చెప్పారో ఇప్పుడన్నా చెప్పేడువు' ఆవేశంగా అడుగుతున్నాడు సుబ్బారావు.

'అదికాదు మామా! ముందు వాడకట్టలో ఆడోళ్లందర్నీ రమ్మని ఆ కంపెనీవాళ్లు మీటింగు పెట్టారు. ఆడకెల్లాక ఆళ్లు చెప్పిందేమిటంటే ఐదుగురేసి చొప్పున గ్రూపుగా ఏర్పడి, మాలో ఒకళ్లని లీడరుగా పెట్టుకోండి అన్నారు. ఎవరు కట్టకపోయినా గ్రూపులో అందరిదీ బాధ్యత అని చెప్పారు. ఎవరికి

డబ్బులిచ్చినా అందరం సంతకాలు పెట్టాలి. ఒక్కసారి పాతికవేలు ఇస్తామన్నారు. ఆటెట్టి టీవీ కొనుక్కోవచ్చు. బంగారం కొనుక్కోవచ్చు. బండి కొనుక్కోవచ్చు.. మనిష్టం ఏమైనా చేసుకోవచ్చు అన్నారు. వారం వారం అసలు ఐదొందలతో పాటు మొత్తం పాతికవేలకీ వడ్డీ కట్టాలి. అట్టా చివరవరకూ కట్టాలి. ముందు మాకందరికీ అర్థం కాలేదు. మంచిగానే ఉందనిపించింది. వారానికి ఐదొందలు కడతాం కదా అనుకున్నాం. తీరా చివరివారంలో అసలు ఇంకా కట్టాల్సింది ఐదొందలే అయినా ఆ వారం కూడా పాతికవేలకీ వడ్డీ కట్టాలి. అప్పుడు ఆళ్లకి వడ్డీ రెండు రూపాయలు కాదు. పది రూపాయలు వసూలవుతుంది. పైకి మనం కట్టేది రెండు రూపాయలుగానే అనిపిస్తుంది. ఆ సంగతి మాకు కొన్ని వారాలయ్యాకగానీ తెలియలా. అప్పటికే చేరిపోయాం.. ఇక చేసేదేం లేక అప్పు తీరితే చాలని దండాలు పెట్టుకుంటున్నాం' వివరించింది దుర్గ.

'ముందే ఎవరైనా తెలిసినోళ్లని అడగకపోతిరి. ఇప్పుడు చూడు ఊళ్లో ఎనిమిది మందిదాకా చనిపోయారు.. చానామంది గొడవలు పడి, కాపురాలు కూలదోసుకుంటున్నారు. ఆఖరుకు ఏమవుద్దో.. ఇప్పుడీ అనిత చచ్చిపోయింది. మన మెడకు చుట్టుకుంది..' అంటూ బీడీ వెలిగించాడు సుబ్బారావు.

మామ ఎక్కడ కొడతాడోనని ఒణికిపోతోంది దుర్గ. అప్పుడే లోపలికి అడుగుపెట్టిన శివమ్మను, సుశీలను, సుభద్రను చూసి ఒక్కసారే వాళ్లను వాటేసుకుని భోరున ఏడ్చింది దుర్గ. అందరూ కలిసి ఏడుస్తున్నారు.. 'నీ.. ఏంటే మీ ఏడుపులు ఆపండెహే..' అంటూ ఒక్క కసురు కసిరాడు సుబ్బారావు.

సుబ్బారావు మెదడులో ఒకటే ఆలోచన. మొన్న పుస్తకాలషాపులో పనిచేసే సత్యంబాబాయి కొడుకు శ్రీను చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఇట్టాంటి కంపెనీవాళ్లు అప్పు అవసరం లేకపోయినా జనం తీసుకునేలా రేపెడతారంట. బాగా డబ్బున్న మారాజులు వాళ్ల డబ్బు మరింత రెట్టింపు చేసుకోడానికి ఇట్టాగే చేత్తారంట.. ఇప్పుడు జరిగిందంతా చూస్తుంటే ఆడు చెప్పింది నిజమేననిపిస్తుంది. అది కొనుక్కోవాలి.. ఇలా చేసుకోవాలి.. ఆళ్లలా గాండుగా ఫన్షన్ చేసుకోవాలి అన్న యావ కూడా జనంలో బాగా పెరిగిపోయింది. నిజంగా వీళ్లల్లో ఒకరిద్దరు తప్ప ప్రాణం మీదకు వచ్చే అవసరం ఉండి తీసుకున్నవాళ్లు తక్కువ. అదే బ్యాంకీలో అప్పు తీసుకుంటే ష్యూరిటీలు, తనఖాలు పెట్టాలి. అదీ కాకుండా వాళ్లు గేదె కొనటానికో, కూరగాయల షాపు పెట్టడానికో మాత్రమే అప్పు ఇస్తామంటారు. అలా అనడం వల్ల తప్పనిసరిగా అవి పెట్టుకోవాలి. అవి పెట్టినపుడు వాటి మీద ఆదాయం వస్తుంది. అప్పు తీరుద్ది. కానీ ఈ గ్రూపుల్లో అప్పు తీసుకున్నోళ్లు చాలామంది పిల్లోడు పుట్టాడనీ, పిల్ల పెద్దమనిషి అయ్యిందనీ, బండి కొనాలనీ, టీవీ కొనాలనీ, బంగారం కొనాలనీ.. ఇలాంటోళ్లే ఉన్నారు. అవి ఖర్చయిపోయాక అప్పు తీరాలంటే తాము సంపాదించుకున్న దాంట్లో నుండి తీసి కట్టాల్సిందే. ఈ పెరిగిపోయిన ధరల వల్ల వచ్చిన ఆదాయంతో ఇల్లు గడిచి, పిల్లల ఫీజులు కట్టడమే మా కష్టమైపోతుంది. ఇంక ఏడ నుంచి కట్టాలి? దీంతో చిక్కుల్లో పడిపోయారు. కొన్న వస్తువుల మీద ఆదాయం వచ్చే మార్గమే లేదు. ఇంతలో చెయ్యి చురుక్కుమని కాలింది. 'అబ్బా...' అని చెయ్యి విదిలించాడు సుబ్బారావు. 'ఓర్నీ... ఎంత మాయచేసి ముంచేశారు..' అనుకోకుండా ఉండలేకపోయాడు సుబ్బారావు.

◆ ◆ ◆

మూడురోజులయ్యాక దుర్గ అక్క శ్యామల దసరా సెలవులకని వచ్చింది. శ్యామల వాళ్లింట్లో చదువుకుంటానని పట్టుబట్టి బాగా చదువుకుంది. హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తుంది. దుర్గా వాళ్లను కూడా కలుపుకుని పుట్టింటికెళదామని ఇటు వచ్చింది. అక్కను చూడగానే ఆమెను కావిలించుకుని ఒక్కసారే పెద్దగా ఏడ్చేసింది దుర్గ. 'ఏమైందిరా తల్లీ?' అని చెల్లెల్ని దగ్గరకు తీసుకుని ఓదారుస్తూ అడిగింది శ్యామల. అక్కడే ఉన్న సుబ్బారావు కలుగజేసుకుని 'ఊరంతా ఇదే పరిస్థితి వదినా...!' అంటూ విషయమంతా చెప్పాడు. అంతా విన్నాక ఆశ్చర్యపోయింది శ్యామల. 'అందరికీ పనులు దొరుకుతున్నాయి. ఈసారి వర్షాలు కూడా బాగానే పడ్డాయి. అందరూ చాలా సంతోషంగా ఉంటారనుకుంటే.. ఇదేంటే.. అయినా.. ఊళ్లో ఒకళ్లను చూసి ఒకళ్లు ఈ వస్తువులు కొనడమేంటి? ఈ ఫంక్షన్లేమిటి? పట్టణాల్లోకన్నా గ్రామాల్లోనే ఈ సంస్కృతి బాగా పెరిగిపోయినట్టుందే. ఇప్పుడేమో అప్పులపాలై ప్రాణాలు తీసుకుంటున్నారు. అయినా చచ్చిపోతే సమస్య తీరిపోద్దా? కొంచెం కూడా తెలివిలేదు.' కోపంగా అంది శ్యామల. 'సర్లే నిన్న రాత్రి మీ చెల్లి కూడా చావబోయింది. సమయానికి మెలకువ వచ్చింది కాబట్టి కాపాడుకోగలిగా' అన్నాడు సుబ్బారావు. ఒక్కసారే నిలువనా కంపించిపోయింది శ్యామల. 'ఎందుకే.. నీ పిల్లల్ని. కట్టుకున్నోణ్ణి ఏం చేద్దామనుకున్నావు? చచ్చిపోవాల్సిన పరిస్థితేంటి?' అని కేకలేసింది శ్యామల. అదికాదక్కా బయటకెళ్లాలంటే అవమానంగా ఉంది. డబ్బులు కట్టకపోతే ఆ కంపెనీవాళ్లతో గొడవ. అల్లరల్లరి అయిపోయా.. పరువంతా బజాట్లో పడింది.. ఇట్టాంటి బతుకు బతక్కపోతే ఏ అనిపించింది?' ఏడుస్తూ చెప్పింది దుర్గ.

'ఇంకా నయం..సుబ్బారావు కనిపెట్టుకోబట్టి సరిపోయింది. చచ్చిపోవడం పరిష్కారం కాదు.. అమెరికాలో కూడా ఇట్లాగే లోన్లు ఇచ్చి ఇళ్లు కట్టుకోమన్నారు. అందురూ ఎగబడి తీసేసుకున్నారు. బిల్డింగ్ కట్టుకున్నాక కారు కొంటానికి లోన్లు ఇస్తామన్నారు. అవి తీసుకుని కార్లు కొన్నారు. ఈ రెండూ ఉండి ఇంట్లో ఫర్నీచర్ లేకపోతే ఎలా అని క్రెడిట్ కార్డుల మీద అవీ కొనుక్కున్నారు. తీరా అప్పులు కట్టాల్సి వచ్చేసరికి తెల్లమొహాలేశారు. బ్యాంకు వాళ్లు కుప్పలు తెప్పలుగా ఇళ్లు, కార్లు స్వాధీనం చేసుకున్నారు. కానీ అవి ఎవరైనా రీసేల్ చేస్తేనేగా వాళ్లకు డబ్బులు వచ్చేది. దీంతో బ్యాంకులూ దివాళా తీశాయి.. ఆ దేశంలోనే సంక్షోభం వచ్చింది... కానీ విచిత్రమేంటంటే అక్కడ ఒకళ్లు కూడా ఆత్మహత్యలు చేసుకోలా' అంది శ్యామల. 'వాళ్లకు ఇల్లూ.. కారు తీసేసుకుని బజాట్లో పడ్డా.. అవ్వా.. అవ్వా.. వాళ్లసలు నోటీసులందుకున్నాడే సగం చచ్చిపోవాలి. అన్నీ జప్తు చేశాక వాళ్లకెట్టా బతకాలనిపిస్తుంది?' ఆశ్చర్యంగా నోరు తెరిచింది దుర్గ.

'అదే మనం కూడా నేర్చుకోవాల్సింది. సమస్యలు వచ్చినపుడు ప్రాణం తీసుకోవడం పరిష్కారం కాదు. ఆ సమస్యకు పరిష్కారం ఏమిటో ఆలోచించాలి. నువ్వు చచ్చిపోయాక నిన్ను, మీ ఆయన్ని అందరూ ఎన్నేసి మాటలంటారు? అప్పుడు పరువు పోదా..? ఇవన్నీ ఆలోచించాలి. పోనీ సమస్య పరిష్కారమైందా అంటే అదీ లేదు. పైపెచ్చు నువ్వు లేకపోవడం వల్ల కుటుంబం చిన్నాభిన్నమైపోతుంది. పిల్లలు అనాథలైపోతారు. అప్పు మాత్రం అలాగే ఉంటుంది' అంది శ్యామల.

'అమ్మో... నిజమే అక్కా.. ఆ క్షణంలో అలా అనిపించిందిగానీ.. నువ్వు చెప్పినట్లు ఇవన్నీ ఆలోచించలేదు..' అంది దుర్గ.'అందుకేనమ్మా! ధైర్యంగా ఉండాలి. సమస్య ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించాలి' అని చెల్లెల్ని దగ్గరకు తీసుకుంది.

ఆమె మెదడులో మాత్రం ఆలోచనలు ముసురేస్తున్నాయి. 'డబ్బు బాగా పోగుపడిన వ్యాపారస్తులు వాటిని రెట్టింపు చేసుకోడానికి ఇలా గ్రామాల్లో ప్రజల్ని మాయపుచ్చి, లేనిపోని ప్రలోభాలు పెట్టి.. అప్పు అవసరం లేకున్నా తీసుకునేలా వాళ్లని ప్రోత్సహిస్తున్నారు.. ఎంత దారుణం.? అసలు దీనికంతటికీ ప్రభుత్వానిదే బాధ్యత. ప్రభుత్వం ప్రజల బాధ్యతల నుండి తప్పుకోవడం. ఇలాంటి వ్యాపారస్తుల మీద ఎటువంటి అజమాయిషీ లేకపోవడం. వాళ్లను ఊళ్లమీద దండుకోవడానికి వదిలేయడం.. వీటన్నింటికీ బాధ్యత ప్రభుత్వానిది కాదా? ఈ సమస్యకు పరిష్కారమేంటి? పేపర్లో ఈ మధ్య ఈ వార్తలు ఎక్కువగా చూస్తుంది కానీ.. దీని వెనుక అసలు మర్మం ఏమిటో తెలియలేదు. దుర్గ వల్ల ఈ కంపెనీల ప్రలోభాలేంటో తెలిశాయి. ఈ కంపెనీల కబంధ హస్తాల నుండి బయటపడే మార్గం లేదా? ఆ పరిస్థితి రాకపోతే ఇంకెందరు చనిపోతారో? ఈ కంపెనీ దొరబాబులు వెనుక ఎవరెవరు ఉన్నారో? ఉండే ఉంటారు? నేటి సమాజంలో డబ్బు, రాజకీయం కవలపిల్లలాయే. ముందు ఈ కంపెనీల్ని అదుపు చేయడం ఒక భాగమైతే.. ప్రజల్లో ఆత్మహత్య చేసుకోకుండా పెద్ద ఎత్తున ప్రచారం చేయడం కూడా చాలా అవసరం. ఇదేమీ ఒక్క దుర్గ సమస్య కాదు. ఇదో సామాజిక సమస్య. సమాజంలో మార్పు రావడమే దీనికి సరైన పరిష్కారం అనుకుంది శ్యామల.

★

కొత్త పుస్తకాలు

అమెరికా భక్తులు చదవాల్సిన పుస్తకం!

అమెరికా చుట్టూ పెట్టుబడిదారీ సమాజం కల్పించిన భ్రమలు ఎన్నో! అమెరికా అంటే భూతల స్వర్గం. అక్కడి జీవితం సర్వ సుఖాల మయం. అక్కడికి వెళ్లగలిగితే చాలు! డాలర్ల పంటే!! ఇదీ మార్కెట్ శక్తులు ప్రపంచానికి అమెరికాను చూపిన తీరు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అత్యంత సహజమైన ఆర్థికసంక్షోభం దీనికి భిన్నమైన వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించింది. సంక్షోభపు సెగలలో మార్కెట్ శక్తులు అమెరికా చుట్టూ పటిష్టంగా కట్టిన అదృశ్యపు గోడ కరిగిపోవడం ప్రారంభమైంది. అక్కడి వాస్తవాల నిలువెత్తు దృశ్యాలు ఇప్పుడు ప్రపంచప్రజానీకానికి దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. అమెరికా దేశపు ఆ రెండవ ముఖాన్ని తెలుగుపాఠకుల ముందు పదిలపర్చిన పుస్తకమే 'పడమటి కొండలు'. అమెరికా అంటే మహా అద్భుతమే కాదు. ఆకలి దప్పులతో అంగలార్చే సాధారణ ప్రజానీకం, డాలర్ల స్వప్నాన్ని నెరవేర్చుకోవడం రెక్కలను ముక్కలు చేసుకోవడంతోపాటు, మనసును కూడా చంపుకుని పనిచేసే వివిధ దేశాల మానవసమూహం, 'ఇదీ ఒక బతుకేనా...' అని నిట్టూరుస్తూనే జీవన పోరాటం సాగించే ఎందరో జీవితాల సంగ్రామస్థలం కూడా అని ఈ పుస్తకం తేటతెల్లం చేస్తుంది. అక్కడి పేదరికం, ఆకలి, నేరాలు, హింస, నిస్సారమైన చీకటి రాత్రులు! పతనమైన సమాజ విలువలు, క్లబ్బులు, పబ్బుల్లో సాగే వలువలు విడిచే వ్యాపారాలు ... వీటన్నింటికి కారణం ఏమిటో పాఠకుడు ఆలోచించుకుని నిర్ధారణకు రావాల్సిందే! అయితే, ఆ దృశ్యాలన్నింటిని రచయిత అక్షరాల రూపంలో కళ్ల ముందు పరచడంలో సఫలీకృతమైనారు. ఇది ప్రధానంగా ఎలాగైనా డాలర్లను సంపాదించి, జీవిత కష్టాలను అధిగమించాలని భారతదేశం నుండి అమెరికాకు వెళ్లిన ఓ డాక్టర్ కథ! చట్టబద్ధంగా వెళ్లలేక అడ్డదోవన వెళ్లిన ఆ డాక్టర్ అక్కడ నిలదొక్కుకోవడానికి చేసిన ప్రయత్నాల వ్యథ! ఆ క్రమంలోనే రచయిత ఇంతవరకు తెలుగు పాఠకులకు పెద్దగా పరిచయం లేని అమెరికా ప్రపంచపు చీకటి దృశ్యాలపై అక్షరాల వెలుగును ప్రసరించారు. అమెరికన్ పేద కుటుంబాల వ్యధార్థభరిత జీవితాలను కళ్లముందు నిలబెట్టారు. అయితే, 286 పేజీల ఈ నవలలో ఆర్థికసంక్షోభం గురించి ప్రస్తావన కనపడదు. రచయిత ముందుమాటలో 'ఈ నవల రాయడానికి కొన్ని సంవత్సరాలే పట్టింది' అని రాయడాన్ని బట్టి చూస్తే సంక్షోభం ప్రారంభం కావడానికి ముందే రాసే పని ప్రారంభమైనట్లు భావించవచ్చు. అప్పుడే అలా ఉంటే, ఇప్పుడేలా ఉంటుందో ...! ఊహించడానికే భయమేస్తుంది!'అక్కడ అనుభవించిన వైవిధ్యభరితమైన, భయంకరమైన సంఘటనలను చెప్పడానికి చేసిన ప్రయత్నం'గా రచయిత చెప్పుకున్నారు. అంటే ఈ నవలలో ఎదురయ్యే సంఘటనలు రచయిత స్వయం అనుభవాలో, అత్యంత దగ్గరగా చూసినవే! ఈ మాట ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే దీనిని అభూతకల్పనగా కొట్టివేసే అమెరికా భక్తులు ఇప్పటికీ చాలామంది ఉన్నారు కాబట్టి! ఇంతా చెప్పి రచయిత గురించి చెప్పకపోవడం భావ్యం కాదు. దీనిని రాసింది డాక్టర్ ఎస్ శంకరరావు. హైదరాబాద్ డిఆర్‌డిఎల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ నవలను తన తొలి ప్రయత్నంగా ఆయన చెప్పుకున్నారు. అయితే, నవల చదివిన వారికి ఎక్కడా అలా అనిపించదు. మొదటిపేజీ నుండి చివరి పేజీదాకా వదలకుండా చదివిస్తుంది. మొదటి ప్రయత్నంలోనే ఇంత మంచి రచన చేయడంతో పాటు, వైవిధ్యభరితమైన అంశాన్ని ఎంచుకున్నందుకు రచయితను అభినందించాలి. సి.పి బ్రౌన్ అకాడమి, నవ్య వీక్లీ నిర్వహించిన పోటీల్లో ఈ నవలకు మొదటి బహుమతి వచ్చింది. నవ్య వీక్లీలో వారంవారం ప్రచురింపబడింది. నవలగా పుస్తకరూపం తీసుకురావడానికి సిపి బ్రౌన్ అకాడమి ఆర్థికసాయం చేసింది. ఈ కృషికి నవ్య, సిపి బ్రౌన్ అకాడమి వారిని కూడా అభినందించి తీరాలి. నవ్యవీక్లీలో ఈ సీరియల్ చదివిన విజయవాడకు చెందిన ఒక డాక్టర్ అమెరికాకు కొత్తగా వెళ్లే వారికి ఈ పుస్తకాన్ని ఇస్తే ఎంతో మేలు జరుగుతుందని రాశారని రచయిత ముందుమాటలో చెప్పారు. ఆ మాత్రమే చాలదు! వీలైతే అమెరికా భక్తులందరి చేత ఈ పుస్తకాన్ని చదివించాలి! ఇంతకూ డాలర్లపై మోజుతో అమెరికాకు వెళ్లిన డాక్టర్ ఎన్ని డాలర్లు సంపాదించాడో చెప్పలేదు కదూ! అది ఇలా ఇక్కడ చెప్పడం కుదరదు. పుస్తకాన్ని చదివితే మీకే తెలుస్తుంది.

- వి. రాజగోపాల్

పడమటి కొండలు

డా॥ ఎస్ శంకరయ్య

వెల : 135/-, పేజీలు :286

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

మరియు

విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



అక్షర శిల్పులు

(ముస్లిం కవులు-రచయితల సంక్షిప్త పరిచయం)

సయ్యద్ నశీర్ అహమ్మద్

వెల : 150/-

పేజీలు :180

ప్రతులకు:

అజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్

శివప్రసాద్ వీధి, కొత్తపేట,

వినుకొండ,

గుంటూరు.



ఇండియా టుడే

(కవితా సంపుటి)

యస్.వికేకానంద

వెల : 50/-, పేజీలు :164

ప్రతులకు:

యస్.వివేకానంద

వసుంధరా పబ్లికేషన్స్,

ఇనెం:11-3-34/9

రోడ్.నెం15, శ్రీవెంకటేశ్వరా కాలనీ

సరూర్ నగర్, హైదరాబాద్.

విశాలాంధ్ర, నవయుగ,

నవోదయ బుక్ హౌస్‌లు.



అదే గొప్ప బహుమానం

"నేను చిన్నతనంలో ఎంత కష్టపడి చదివాను? కేవలం ప్రతిభతోనే వైద్య కళాశాలలో ప్రవేశం పొంది, డాక్టర్‌నై మంచి ఆసుపత్రిని నడుపుతున్నాను. కాని, నా బిడ్డ మాత్రం బాధ్యత తెలుసుకొని కష్టపడి చదవడం లేదు. అంతకన్నా బాధాకరమైన విషయమేమిటంటే, 'ఎంసెట్‌లో సీటు రాకపోతే నాకు మెడిసిన్ సీటెందుకు కొనరు?' అని నన్నే ఎదురు ప్రశ్నిస్తున్నాడు. ఎందుకని మన బుద్ధులు మన పిల్లలకు రాలేదంటావ్?.." ఓ రోజు ఉదయాన్నే ఒక మిత్రుడు మరో అప్తమిత్రునితో ఫోన్‌లో తన బాధను వెళ్ళబోసుకున్నాడు.

***

ఒకానొక కోటీశ్వరుని కొడుకు రాజభోగాలన్నీ అందుబాటులో ఉండికూడా రాత్రింబగళ్ళు చదువులో మునిగి తేలుతూ ఎంసెట్‌లో ప్రథమ స్థానం పొందాడు. డబ్బున్న పిల్లవాడికి చదువుపై అంత శ్రద్ధ, ఇష్టం ఎలా వచ్చాయి?

***

జనంలో మంచి పేరున్న డాక్టర్ సుబ్బరావ్‌గారి అబ్బాయి పండిత పుత్రుడైపోయాడు సరే, ఊళ్ళో జనాన్ని అడుగుడుగునా భయపెట్టే సంఘవ్యతిరేక బీజమై పోయాడెందుకని?

***

వారాలు తింటూ చదువుకొని, పెద్ద ఆఫీసరైన పిచ్చేశ్వరరావుకు పేదరికం, అందులోని కష్టాలు తెలుసు. మరి వాళ్ళ పిల్లలిద్దరికీ పేదలంటే జాలే కలగదెందుకు?

***

నిత్యజీవితంలో మనం ఇటువంటి ఎన్నో ప్రశ్నలు ఎదుర్కొంటూంటాం, ఉదాహరణలు చూస్తూనే ఉంటాం. నలుగురు మిత్రులు కలిసినప్పుడు వారి మధ్య ఇటీవల ఇలాంటి మాటలు సాధారణమైపోయాయి. ఇవి మనం అర్థం చేసుకోలేని సమస్యలు కావుగానీ, ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలంటే ముందుగా మనం ఇంకో ప్రశ్న వేసుకోవాలి–"మన తల్లిదండ్రులు మనను గురించి కలలు కన్నట్లే, వాళ్ళు కోరుకున్నట్లే మనం ఉన్నామా?". అసలు మన తల్లిదండ్రుల ఆలోచనలతో, రాజకీయ అభిప్రాయాలతో ఇప్పుడు మనం ఏకీభవిస్తున్నామా? ఎందుకిలా జరుగుతున్నది?– తల్లిదండ్రులొక విధంగా అనుకోవడం, పిల్లలు మరో రకంగా తయారవడం!

సాధారణంగా తాము చిన్ననాడు సాధించలేని పనులన్నీ తమ పిల్లలు సాధించాలని, తమ ఆశలన్నీ నెరవేర్చాలని, తమ బిడ్డల ద్వారా ఎక్కువ పేరు ప్రతిష్ఠలు పొందాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. తమ ఆలోచన, ప్రవర్తన, కోర్కెలు అత్యంత సమంజసమనే వారికనిపిస్తాయి. పిల్లలు అందుకు భిన్నంగా ఆలోచిస్తే, కొత్తగా ప్రవర్తిస్తే, వారి ఊహలకు కొత్త రెక్కలొస్తే పెద్దలు కంగారు పడిపోతారు. పిల్లల ప్రతి చిన్న విషయాన్ని తమ చిన్ననాటి సంఘటనలతో పోల్చి చూసుకుంటూ వారు తమలా లేనందుకు మానసిక సంఘర్షణకు గురౌతారు. మారుతున్న అవసరాలను, ప్రపంచాన్ని, కాలస్వభావాన్ని స్థిమితంగా అవగాహన చేసుకొని, సర్దుకుపోలేరు. అందుకే ప్రతి తరం తన అనంతర తరాలతో అసంతృప్తి చెందుతూనే ఉంటుంది. తరాల మధ్య అంతరం, కొత్తపాతల మధ్య సంఘర్షణ ఎప్పటి నుండో జరుగుతున్నదే. కొత్తపాతల మేలు కలయికతోనే సమాజ పురోగమనం సాధ్యపడుతుంది.

ఈ ప్రకృతిలోని సమస్త జంతువులు రెక్కలు వచ్చి జీవన నైపుణ్యాలు నేర్చుకొని, తమ కాళ్ళ మీద నిలబడే వరకు తమ బిడ్డలకు రక్షణగా నిలవటం చూస్తుంటాం. కొందరు మనుషులు మాత్రం తమ పిల్లలకు 30 ఏళ్ళు దాటినా ఇంకా వాళ్ళను పెంచుతూ, పర్యవేక్షిస్తూ తీరిక లేకుండా ఉండటమే ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే, యూరప్, అమెరికా సమాజాలలో తల్లిదండ్రులు పిల్లల స్వేచ్ఛకు, సృజనశీలతకు అడ్డుపడరు. స్నేహితులు లాగా కొంతమేరకు ప్రోత్సహిస్తారు. తమ ఆస్తులను వాళ్ళకు అప్పగించడం కూడా ముఖ్యమనుకోరు. తమ ఆలోచనలను, ఆశలను పిల్లల మీద రుద్దరు. తల్లిదండ్రులుగానీ, ఉపాధ్యాయులుగానీ, పిల్లల్ని దండించడం అక్కడ శిక్షార్హమైన సాంఘిక నేరంగా పరిగణిస్తారు. మన భారతీయ సమాజం ఈ విషయంలో ఇప్పుడే కొద్దిగా మారుతున్నది.

జీవపరిణామంలోని చిట్టచివరి అద్భుతమైన మానవశిశువులు ప్రత్యేకమైన పనులకోసం ప్రత్యేకమైన 'జీన్సు'తో పుడతారు. ఓ రకంగా అందరూ కారణజన్ములన్నమాట! ప్రపంచంలోని 700 కోట్ల జనంలో, కవలల్లోనైనా సరే – మనిషిని పోలిన మనిషి ఉండనట్లే, పూర్తిగా ఒకేలాగా ఆలోచించే మనుషులు కూడా ఉండరు. –వారు ఒక కుటుంబంలో వారైనా సరే! ఈ లోకంలోని ఇతర శిశువుల లాగే, తమ బిడ్డ కూడా ఒక అపురూపమైన ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడని ఆ తల్లిదండ్రులు ముందుగా తెలుసుకోవాలి. తమ పిల్లల ద్వారా తమ ఆశలు, కలలు నెరవేర్చుకోవడం కాదు చేయవలసింది. మొగ్గ పువ్వుగా విప్పారినట్టు వారిని వారిగానే ఎదగనివ్వాలి, వారిని వారిగానే బతకనివ్వాలి. మొదటి 15 ఏళ్ళు వారికి తగినంత ప్రేమను, చక్కని గృహ వాతావరణాన్ని కల్పించి, వారి అభిరుచులను తగినట్లుగా పూర్తి స్వేచ్ఛగా, ఆనందంగా పెంచడమే బిడ్డకు ఏ తల్లిదండ్రులైనా ఇవ్వగల గొప్ప బహుమానం! ఇక, ఆ వయసు తరువాత అతడు ఏ చదువునెంచుకొని, ఏ వృత్తిలో స్థిరపడి, ఎలా ఎదుగుతున్నాడో చూసి, మంచి స్నేహితుల్లాగా సంతోషపడటమే తల్లిదండ్రులు చేయవలసిన పని.

నాటిన అన్ని విత్తనాలు మొలకెత్తకపోవచ్చు. మొలకలన్నీ ఒకలాగే మొక్కలై, మానులు కాక పోవచ్చు. అలాగే ఒక వయస్సులోని పిల్లలంతా ఒకే విధంగా పరిపూర్ణులు కాకపోవచ్చు. ఎవ్వరి అభిరుచుల కనుగుణంగా వారి దారులు ఉంటాయి. అప్పుడప్పుడూ ఆ దారుల్లో రాళ్ళు, ముళ్ళు కూడా ఉండవచ్చు. సమస్యలేవైనా ఎదురైనప్పుడు పెద్దలు వారికి మిత్రులుగా సలహాలిచ్చేవరకే పరిమితం కావాలి. తమ పిల్లలకు రోజువారీ పనులు నేర్పక, వారు చేసే పనులకు అడుగడుగునా అడ్డుతగులుతూ, వారి పనులన్నీ తామే చేసిపెడుతూ, అతిగారాబం చేయడం మంచి తల్లిదండ్రుల లక్షణం కాదు. తమ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్ళ జీవితం గడపాలని, వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడే సమర్థులు కావాలనీ, సంఘవ్యతిరేక శక్తులు కాకూడదనీ, తమ శక్తివంచన లేకుండా తోటివారికి సహాయపడే వారు కావాలనీ, మంచికి, మానవత్వానికీ, ప్రతీకలుగా బతకాలనీ, పెద్దలను గౌరవించాలనీ, నిజాయితీగా జీవించాలనీ, తల్లిదండ్రులు కోరుకోవడం సమంజసం. అంతకు మించి, వారిపైన గొంతెమ్మ కోరికలు పెట్టుకొని వారిని వత్తిడి చేసి తాము ఆందోళనలు చెందే తల్లిదండ్రులకు నిజమైన సంతోషం మిగలదు.

–డా॥డి.ఆర్.కె.ప్రసాద్

బాలనేస్తాలు

పదాలు పూరిద్దాం





జవాబు: icecream, computer.



పడవెళ్లి పోతోందిరా....

బుజ్జాయిలూ...పడవ చూశారా! ఎంత హాయిగా కదులుతోందో నీళ్లల్లో...ఏంటి అలా అపనమ్మకంగా చూస్తున్నారు? మేం చెప్పే మాట మీద నమ్మకంలేదా? పుస్తకంలో పడవేంటి? కదిలిపోవడమేంటి? అనుకుంటున్నారా? అయితే మేం చెప్పినట్టు చేయండి. కను రెప్పలు ఆర్పకుండా అలా పడవ వేపే చూడండి. మీకు ఏం కనిపించింది? పడవ వెళ్లిపోతూ...కనిపించిందా! అదేకదా ముందు మేం చెప్పింది!

వనదేవత ఎక్కడుందోచ్!

నేస్తాలూ! ఈ బొమ్మలో మీకేం కనిపిస్తున్నాయి? చక్కగా సుందర ప్రకృతి దృశ్యం మీ ముందుకొచ్చినట్టు అనిపిస్తోందా! మాక్కూడా అంతేనర్రా! అయితే ఇక్కడ మీకు వన దేవత కనిపించిందా? లేదా! పుస్తకాన్ని కొంచెం దూరంగా పెట్టుకొని చూడండి.

రెండు చెట్లమధ్య తల కన్పిస్తుంది.





ఎలా పోవాలి?

చిన్నారులూ...ఈ బుజ్జి పక్షికి ఇప్పుడిప్పుడే రెక్కలొచ్చాయి. ఆకాశంలో ఎగరాలని కోరిక. కానీ పేద్ద మేఘం అడ్డు వచ్చింది. ఏ దారిలోంచి వెళితే చిన్నారి పక్షి ఆకాశంలో ఎగరగలదు?

ఏమేం వున్నాయి?

ఫ్రెండ్స్! ఈ బొమ్మలో మీకు ఓ విచిత్రమైన ప్రాణి కనిపించిందికదా. ఇందులో ఏమేం జంతువుల శరీర భాగాలున్నాయి? చెప్పుకోండి చూద్దాం.

జవాబు: కుక్క, చిలుక, జీబ్రా, తూనీగ, పాము

అచ్చు ఒకేలా వున్నదేది?

పిడుగులూ... 'ఎ' బొమ్మ చూశారుగా. అందులో ఒక తుంటరి పిల్లవాడు తన ఆటబొమ్మలతో పెద్ద ఫోజుగా నిలబడ్డాడు. అయితే ఆ పక్కనే మరో నాలుగు బొమ్మలున్నాయి. అవి చూడ్డానికి అచ్చంగా 'ఎ' బొమ్మలాగే వున్నాయి. కానీ మూడిట్లో మాత్రం తేడాలున్నాయి. అచ్చు 'ఎ' బొమ్మ లాగేవున్న బొమ్మ ఏదో చెప్పాలి. మరి కనిపెట్టండీ.



జవాబు: ఇ

ఏవి ఎన్ని?

ఫ్రెండ్స్! ఈ బొమ్మను ఒకసారి పరిశీలనగా చూడండి. ఒక పవర్‌ప్లాంట్, వాహనం, కొండలు, సూర్యుడు కనిపిస్తున్నాడా! అయితే అన్నీ కూడా చతురస్రం, త్రికోణం, దీర్ఘచతురస్రం, వృత్తాలతో చేసినవే. ఇంతకీ ఈ బొమ్మలో ఏ ఆకారాలు ఎన్ని వున్నాయి? గుర్తించి చెప్పాలి.



జవాబు: వృత్తాలు10, త్రికోణాలు14, చతురస్రాలు10, దీర్ఘచతురస్రాలు13.

చుక్కలు కలిపేద్దాం



మాటల కోట - 22

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1		2		3		4		5
		6			7			
8	9					10	11	
			12		13			
14								15
	16		17				18	
19		20				21		22
		23			24			
25				26		27		

అడ్డం :

1. గుడిసె (3)
3. సరేనని నోరు మూసుకునీ చెప్పొచ్చుకదూ? (1)
4. సకాలం. నిలువు ఐదుకు తోడు (3)
6. నడకలో అడుగుకూ అడుగుకు మధ్య దూరం. దుడు కోల్పోయిన రామాయణ పాత్రధారి (2)
7. తాళ్లకు మూలం. అడవిలో సీతారాములు ఈ దుస్తులనే ధరించారంటారు(2)
8. విలాసం (3)
10. దారి మార్చిన ఏమరపాటు (3)
12. జెండా (3)
14. కవి అంటే కష్టజీవికి కొమ్ముకాయాలన్నాడు మహాకవి శ్రీశ్రీ. మొదటి కొమ్ము ఇక్కడ రాయండి(1)
15. మరి రెండో కొమ్ము ఏమిటో?
17. సంతోషం. నెహ్రూ తర్వాత, లాల్‌బహదూర్ తర్వాత ప్రధానికి దీర్ఘం, చివర - కం - కలిసింది (3)
19. ఆయాసం (3)
21. ఉపాధ్యాయుడు, భవిష్యత్తుకు దారి చూపువాడు, తెలుగు చందస్సులో పొట్టిది కానిది (3)
23. వెయ్యి - ఒకటి కాదు అధికం. అయితే దారి మళ్లింది సుమా (2)
24. ఇది మబ్బుల ఏడుపని ఓ కవిగారి చమత్కారం (2)
25. కదలిక (3)
26. ఔనని ఒకే పదాన్ని సుదీర్ఘంగా అరవండి (1)
27. పక్షుల ఇల్లు (3)

నిలువు :

1. నిద్ర (3)
2. విత్తనం చెల్లాచెదురయింది. ప్రారంభం అని కూడా (3)
4. విశాఖ జిల్లాలో అందమైన పర్యాటక కేంద్రం. కొత్తగా ఏర్పడిన లోక్‌సభ నియోజకవర్గం కూడా (3)
5. కిందనుంచి సాగుకు సరిపడ వానతో భూమి సిద్ధం. 4 అడ్డానికి జోడి (3)
9. వృశ్చికం కింద నుంచి పైకి పాకింది (2)
11. రావటం లేదని చెప్పండి. లేకుంటే రాముడికి తోక తెంచండి (2)
12. దిగజారిపోవటం (3)
13. గొయ్యి (3)
16. ఉపయోగం (2)
18. మధ్యమ పురుష బహువచనంలో ఎదుటి గుంపును సంబోధించండి. అతిక్రమించు (2)
19. రెండింటిని కలపటం, మాసిక (3)
20. అటునుంచయినా, ఇటునుంచయినా తేడా లేని సి విటమిను రుచి (3)
21. మట్టి తవ్వకానికి వినియోగించే పరికరం (3)
22. పొట్ట. ప్రారంభంలో అచ్చుకు బదులు అదే శబ్దపు హల్లు (3)

మాటలకోట - 21 జవాబు

1 సు	రు	2 లు		3 రో		4 జ	లు	5 బు
కృ		6 పా	7 క		8 మా	మ		లు
9 తి	10 ట్టు		11 త	12 రు	గు		13 జా	గు
	14 చె	15 వి		16 చా		17 క	డ	
18 కో		19 న	క్క		20 వా	డ		21 తి
	22 గ	తి		23 కా		24 లి	25 గా	
26 స	బ్బ		27 నా	య	28 న		29 నం	30 ది
మ		31 తో	వ		32 కూ	33 రి		గు
34 రం	ద్రా	లు		35 బో		36 క	న	లు




వారెవా! ఏమి మీసాలు!!



'అయ్యారే...ఏమి మీసాలు...గడ్డాలు! విచిత్రముగా వున్నవి? వీరంతా ఏ రాజులకాలము నాటివారు!?' అనుకుంటున్నారా? అలా అయితే పొరపాటు బడ్డట్టే. వీరంతా ఈ కాలానికి చెందినవారే. కాకపోతే ప్రతిసారీ జరిగే ప్రపంచ ఉత్తమ మీసాలు-గడ్డాల పోటీల్లో గెలుపొందిన, పాల్గొన్న వారు. చూశారుగా. ఒక్కొక్కరు ఎంత పొడవాటి మీసాలు పెంచేశారో! కొందరైతే మీసాలమీద నిమ్మకాయలు నిలబెట్టేట్టున్నారు. కొందరేమో ఈతాకుల్లా సూదుల్లా పెంచేశారు. మరికొందరేమో గడ్డాలను గుబురుపొదల్లా పెంచేశారు. వావ్...ఒక్కొక్కరిని చూస్తుంటే మతిపోతోంది.

కాకపోతే వీరినిలా చూస్తుంటే మీకో అనుమానం వచ్చుండాలే! ఏంటండీ అలా చూస్తున్నారు! అదేంటో కూడా మేమే చెప్పాలా? అదేనండీ...వీరిలా మీసాలు గడ్డాలు సూదుల్లా, పొదల్లా పెంచేశారు బానేవుంది. మరి వారి వారి జీవితభాగస్వాముల బాధలు ఒక్కసారి ఊహించుకోండి!





భక్తులకు దసరా, దీపావళి పండుగల శుభాకాంక్షలతో...

శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయము

బూడిదగడ్డ బస్తీ, **కొత్తగూడెం**, ఖమ్మం జిల్లా. ఫోన్ : 08744 - 240665, 325376, సెల్ : 9948475492



శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయం

దేవాలయంలో జరుగు పూజా కార్యక్రమాలు :

1) మైసమ్మ దేవి కొలువులు 2) ఉప్పలమ్మదేవి కొలువులు 3) ఆషాడ మాసం బోనాల జాతర
4) ఆశ్వయుజ మాసంలో (దేవిశరన్న రాత్రులు) 5) మార్గశిర మాసంలో (షష్టి) సందర్భంగా
శ్రీ వల్లి దేవసేనాసహిత సుబ్రమణ్యేశ్వరస్వామి వారి కళ్యాణం 6) శివరాత్రి సందర్భంగా ఏకనామము
(ఓం నమ: శివాయ) 7) శ్రీ రామనవమి సందర్భంగా ఏకనామము (రామనామము)

శ్రీ లక్ష్మీగణపతయే నమ:

శ్రీ మాత్రే నమ: ఓం నమశ్శివాయ శ్రీ రామజయం

శివ పంచాయతన క్షేత్రము

శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయము

బూడిదగడ్డ బస్తీ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా.

నూతనంగా నిర్మించిన శివ పంచాయతన క్షేత్రము

భక్త మహాశయులకు విజ్ఞప్తి ...!

ఖమ్మం జిల్లా, కొత్తగూడెం, బూడిదగడ్డ బస్తీ నందు నూతనముగా శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధి నిమిత్తమై అహర్నిశలు కృషి చేసి అమ్మవారి యొక్క ఉపాసనా బలం వల్ల విశేషమైన దేవాలయ నిర్మాణములు ప్రతిష్టలు భక్తుల యొక్క సంపూర్ణ సహకారములతో అత్యంత వైభవముగా నిర్వహించి ఉన్నతమైన కృతితో "శివపంచాయతన క్షేత్ర నిర్మాణము" ను కూడా అఖంటితమైన దీక్ష భక్తుల యొక్క సహకారములతో అత్యంత సుందరముగా నిర్మించిన దేవాలయములో భక్తులు స్వయముగా అభిషేకము చేసుకొనుటకు వీలుగా వాయు ప్రతిష్టగా నిర్వహించదలచి కాశీక్షేత్రము నుండి నర్మదా బాణము అని ప్రశస్తి కల్గిన పెద్ద శివలింగము ను తీసుకురావడం జరిగింది. అలాగే పంచాయతన క్షేత్రమునకు సంబంధించిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారు, శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారు, శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి వారు, శ్రీ సూర్యనారాయణ స్వామి వారు, శ్రీ చండీశ్వర స్వామి వారు మరియు ఆదిత్యాది నవగ్రహ విగ్రహములు మొదలగు ప్రతిష్టామూర్తులు, ఉత్సవ మూర్తులు ధ్వజము నంది వాహనము ద్వారా పాలకులు మొదలగు ప్రతిష్ట కార్యక్రమాలు జరిగినవి.

భవిష్యత్ అభివృద్ధికై భక్తులు తమ వంతు సహాయముగా విశేషమైన విరాళములు అందించగలరని కోరుతూ.... అమ్మవారి యొక్క శ్రీ స్వామి వార్ల యొక్క పరిపూర్ణ అనుగ్రహమును పొంది తరిస్తారని మనసారా మరీ మరీ విన్నవించుకుంటున్నాము.

భక్తులందరి అభినందనలతో...

శ్రీ నరేంద్ర భవాని స్వామి
కాళి ఉపాసకులు.